


భారత్
# ప్రతినిధి
తెలుగు దిన పత్రిక






సంపుటి: 3 సంచిక: 304 పేజీలు: 8 సంపాదకులు: రొళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు గురువారం, 27 ఆగష్టు 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 304 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR THURSDAY, 27 AUGUST 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI




# ఏడుగురు మత్స్యకారులు క్షేమం

పశ్చిమ బెంగాల్‌లో ఏడుగురూ సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ

బోటు ఎలా తప్పిపోయింది? ఏ మార్గంలో వెళ్లింది? అన్ని కోణాల్లో పరిశీలన

మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న శుభవార్తతో కుటుంబాల్లో ఊరట

మత్స్యకారుల భద్రతకు ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత

మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది: మంత్రి అచ్చెన్నాయుడు

## ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి నిర్మాణమే సీఎం లక్ష్యం

అసెంబ్లీ భవన రూపకల్పనపై నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్‌తో కీలక చర్చలు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్





# ఆధ్యాత్మిక పిఠాపురానికి అభివృద్ధి వెలుగులు

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో రూ.30.66 కోట్లు కేటాయింపు

24 దేవాలయాల పునరుద్ధరణకు రూ.17.06 కోట్లు

టీటీడీ కల్యాణ మండపానికి రూ.2 కోట్లు

48 భజన మందిరాలకు రూ.11.60 కోట్లు

లక్షలాది భక్తులకు మెరుగైన వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు'

పునరుద్ధరణ జరుగుతున్న ఆలయాల్లో శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ముఖ్యంగా పిఠాపురంలోని పంచ మాధవ క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన 10వ శతాబ్దం నాటి శ్రీ కుంతీమాధవ స్వామి ఆలయంతోపాటు, పిఠాపురం మహారాజుల కాలం నాటి అనేక పురాతన దేవాలయాలు ఈ ప్రాజెక్టు ద్వారా సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి.



## జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా

# 'సంజీవని'

కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ

ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం

వైద్యారోగ్యం, సంజీవని ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి: వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన 'సంజీవని ప్రాజెక్టు'ను జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఏపీని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా 'సంజీవని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సీఎం సూచించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం 'సంజీవని ప్రాజెక్ట్'పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని... ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

సమీక్షలో సీఎం మాట్లాడుతూ...'ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఏఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంతో పాటు... డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి. సమర్థవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలిగించేలా ఒక విధానం తీసుకురావాలి. విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి.

- నేపాల్‌లో ఆకస్మిక వరదలు
- వరదల్లో వందలాది మంది గల్లంతు
- అందులో 105 మంది భారతీయులున్నట్లు అంచనా
- టిబెట్‌లో భారీ వర్షాలతో ఉప్పొంగిన కోశీనది
- బురదమయంగా మారిన కొండతీర ప్రాంతం

నేపాల్ వరదలతో భారీగా ఆస్తి,ప్రాణ నష్టం దెబ్బతిన్నఇళ్లు, రోడ్లు, వంతెనలు, హైడ్రోపవర్ ప్రాజెక్టులు సహాయక చర్యలకు దిగిన భద్రతా బలగాలు



105 మంది భారతీయులు గల్లంతు!

# నేపాల్‌లో వరద బీభత్సం..



## 22ఎను వెంటనే తొలగించాలి

లేకుంటే సచివాలయం ముట్టడిస్తాం

భూకబ్జాల హైదరాబాద్ బ్రాండ్‌కు దెబ్బ

రేవంత్ ప్రభుత్వం భూ అమ్మకాలతో బిజీ

బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు



## కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ఆగివున్న లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికుల దుర్మరణం

మృతులంతా ఏపికి చెందిన వారిగా గుర్తింపు

ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం రేవంత్

తక్షణ సహాయక చర్యలకు ఆదేశం...



# అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

నిజామాబాద్: అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు కుటుంబసభ్యులకు ఈ సమాచారం అందింది. ఉన్నత చదువుల కోసం మూడు నెలల క్రితం అమెరికా వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు హరిబాబు, నాగమణి కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువకులు మృతిచెందారని తెలుస్తోంది.. ఫ్లోరిడాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. మృతుల్లో నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ ఉన్నారు. రాహుల్ సుమారు మూడు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. ఉన్నత చదువులు లేదా ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన కొద్దికాలానికే రోడ్డు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మంగళవారం రాత్రి మొత్తం ముగ్గురు స్నేహితులు కలిసి కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కారు చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందినట్లు రాహుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాహుల్ మృతితో నవీపేట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

మూడు నెలల క్రితమే అమెరికా వెళ్లిన యువకుడు ఇలా అనూహ్యంగా మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాహుల్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఏడుగురు మత్స్యకారులు క్షేమం

అమరావతి: కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ కావడం పట్ల వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న శుభవార్తతో వారి కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారని, వారిని త్వరగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఈ నెల 3న ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు బోటులో సముద్ర వేటకు వెళ్లారని మంత్రి తెలిపారు. నిర్ణీత సమయంలో బోటు తిరిగి రాకపోవడంతో సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా స్పందించి, మత్స్యకారుల ఆచూకీ కోసం ఎలాంటి ఆలస్యం చేయకుండా అన్ని విధాలుగా గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారని చెప్పారు. మత్స్యకారుల భద్రత విషయంలో ముఖ్యమంత్రి చూపిన ప్రత్యేక చొరవ, శ్రద్ధ అభినందనీయమని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటూ, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని, నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ఆదేశించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తాను కూడా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ కేంద్ర అధికారులు, నేవీ, కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడినట్లు మంత్రి వెల్లడించారు.మత్స్యకారుల ఆచూకీ కోసం సముద్రం, గగనతలం నుంచి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు, బోటు ఎలా తప్పిపోయింది, ఏ మార్గంలో ప్రయాణించి ఉండవచ్చు, ప్రస్తుతం ఏ ప్రాంతంలో ఉండే అవకాశం ఉందన్న అంశాలపై అన్ని కోణాల్లో పరిశీలన జరిపామని మంత్రి తెలిపారు. బోటులో సాంకేతిక సమస్య తలెత్తి ఉండే అవకాశం సహా ప్రతి అంశాన్ని నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో సమన్వయంతో పరిశీలించామని చెప్పారు. గాలి దిశ, వేగం, సముద్ర ప్రవాహాలు, బోటు డ్రిఫ్ట్ అయ్యే అవకాశం వంటి అంశాలను కూడా శాస్త్రీయంగా విశ్లేషించి, బోటు పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండవచ్చున్న అంచనాతో ఆ ప్రాంతంలోని కోస్ట్‌గార్డ్ యూనిట్లు, స్థానిక మత్స్యకారులను అప్రమత్తం చేశామని మంత్రి తెలిపారు.

## ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి నిర్మాణమే సీఎం లక్ష్యం

అమరావతి,: ప్రపంచంలోనే అద్భుతమైన రాజధానిగా అమరావతిని నిర్మించాలన్నదే ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర మంత్రి శ్రీ మనోహర్ తెలిపారు. ఈ లక్ష్యానికి అనుగుణంగా రాజధానిలోని శాసనసభ భవనాన్ని అత్యున్నత ప్రమాణాలతో, భవిష్యత్ అవసరాలను దృష్టిలో
ఉంచుకుని నిర్మించేందుకు రూపకల్పనపై కీలక చర్చలు జరిపినట్లు వెల్లడించారు.అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్ట్‌నర్స్ ప్రతినిధుల బృందంతో రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగిన తదుపరి మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ అమరావతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న శాసనసభ భవనానికి సంబంధించి అంతర్జాతీయ స్థాయి ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో పలు అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు.శాసనసభ భవనం పైన ప్రత్యేక టవర్‌ను ఏర్పాటు చేసి, అక్కడి నుంచి అమరావతి రాజధాని మొత్తాన్ని వీక్షించేలా నిర్మాణ రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో నియోజకవర్గాల డీలిమిటేషన్ వల్ల ఏర్పడే మార్పులను దృష్టిలో ఉంచుకుని, దీర్ఘకాలిక అవసరాలకు అనుగుణంగా భవన డిజైన్లను రూపొందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 265 శాసనసభ స్థానాలు, 110 శాసనమండలి స్థానాలకు అనుగుణంగా శాసనసభ భవనాన్ని డిజైన్ చేస్తున్నట్లు మంత్రి వివరించారు.ప్రజలు శాసనసభను సందర్శించినప్పుడు రాష్ట్ర ప్రజాస్వామ్య వ్యవస్థ, శాసన ప్రక్రియపై అవగాహన కలిగేలా, వారికి మంచి అనుభూతిని అందించే విధంగా ప్రత్యేకంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.గవర్నర్ ప్రసంగించే సందర్భాల్లో శాసనసభ, శాసనమండలి ఉభయ సభల సభ్యులందరూ ఒకే చోట కూర్చునేలా సెంట్రల్ హాల్ ఏర్పాటు చేసే విధంగా డిజైన్ రూపొందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.



# నేపాల్‌లో వరద బీభత్సం..

ఖాట్మండ్: నేపాల్‌లో బుధవారం ఉదయం అకస్మాత్తుగా ముంచుకొచ్చిన వరదలు అనేక మందిని పొట్టనపెట్టుకున్నాయి. 105 మంది భారతీయులు కూడా ఈ విపత్తులో గల్లంతయ్యారు. ఓ అంచనా ప్రకారం 1500 మంది గల్లంతయ్యారని అంటున్నారు. చైనాతో సరిహద్దుకు సమీపంలోని రసువా జిల్లాలోని భోటే కోశీ నదిలో ఒక్కసారిగా వరద పోటెత్తడంతో తీరంలోని అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో నేపాల్‌కు దిగువన ఉన్న బిహార్, యూపీ రాష్ట్రాలు కూడా అప్రమత్తమయ్యాయి. మరోవైపు, ఈ అకస్మిక వరదలకు కారణం ఏంటో తెలుసుకునేందుకు నేపాల్ అధికారులు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. ఆకస్మిక వరదలు కేవలం గంటల వ్యవధిలోనే విరుచుకుపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఒక్కసారిగా భారీ స్థాయిలో కుండపోత వర్షం కురిసినా, లేదా నదీప్రవాహానికి అడ్డుగా ఉండే కొండచరియలు విరిగి పడిన సందర్భాల్లో కూడా ఆకస్మిక వరదుల దిగువన ఉన్న ప్రాంతాలను ముంచెత్తుతాయి. కొండల్లోని మంచు కరగడంతో ఏర్పడే గ్లేషియల్ సరస్సులు అస్థిరమై ఒక్కసారిగా కిందకు దూసుకొచ్చిన సందర్భాల్లో కూడా లోతట్టు ప్రాంతాలను ఆకస్మిక వరదలు ముంచెత్తుతాయి. అంతెత్తున ఉండే కొండల నుంచి కిందకు వేగంగా దూసుకొచ్చే నీటి ప్రవాహానికి తన దారిలో ఉన్న అన్ని నిర్మాణాలను నేలమట్టం చేయగల శక్తి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, రసువా జిల్లాలో వర్షాలకు అవకాశం తక్కువని అక్కడి వాతావరణ శాఖ ముందే అంచనా వేసింది. కానీ నేపాల్‌కు ఎగువన ఉన్న టిబెట్‌లో భారీ వర్షం కురిసిన విషయం శాటిలైట్ చిత్రాల్లో బయటపడ్డట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయమై తమను ముందస్తుగా హెచ్చరించడంలో చైనా విఫలమైందని ఇప్పటికే నేపాల్ జర్నలిస్టు ఒకరు నెట్టింట తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నేపాల్ ప్రధానికి మోడీ ఫోన్

న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీ.. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. మెరుపు వరదల కారణంగా జనం ప్రాణాలు కోల్పోవటంపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. వరద పరిస్థితులపై ఆరా తీశారు. అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో బుధవారం ఓ పోస్టు పెట్టారు. పోస్టులో.. 'ప్రధాన మంత్రి బాలేంద్ర షాతో మాట్లాడాను. నేపాల్‌లో సంభవించిన వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేశాను. ఈ కష్టసమయంలో నేపాల్‌లోని సోదర సోదరీమణులకు భారతదేశ ప్రజలు అండగా ఉంటారు. నేపాల్‌కు సాధ్యమైనంత వరకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడానికి భారతదేశం సిద్ధంగా ఉంది. సహాయక, రక్షణ చర్యలపై మా బృందాలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తున్నాయి' అని పేర్కొన్నారు. ఉధృతంగా ప్రవహించిన భోటేకోశీ నది నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. టిబెట్ వైపు నుంచి వచ్చిన మెరుపు వరదల కారణంగా పలు ఊళ్లు, బ్రిడ్జులు, ప్రాజెక్టులు నీటిలో కొట్టుకుపోయాయి.

హిమాలయాల్లో ఉన్న నేపాల్‌లో భారీ పర్వతాలు, వాటి నుంచి కిందకు వేగంగా దూసుకొచ్చే నదులతో ఎల్లప్పుడూ ముప్పు పొంచి ఉంటుంది. ముఖ్యంగా వానాకాలంలో కురిసే వర్షాల కారణంగా కొండ కోనల్లో పోటెత్తే వరదలు చూస్తుండగానే మహోగ్రరూపం దాలుస్తాయి. ఇది చాలదన్నట్టు వాతావరణ మార్పులు పరిస్థితులను మరింత జటిలం చేస్తున్నాయి. భూతాపం పెరుగుతుండటంతో నేపాల్‌లోని కొండలపై మంచు కరిగిపోతోంది. హిమనదాలు కనుమరుగు అవుతున్నాయి. ఫలితంగా కొండలపై భారీ గ్లేషియల్ సరస్సులు ఏర్పడుతున్నాయి. కొండప్రాంతాలు సహజంగా అస్థిరంగా ఉంటాయి. ఇలాంటి ప్రాంతాల్లో కొండచరియుల విరిగిపడ్డా లేక కాస్త ఎక్కువ వర్షం కురిసినా సరస్సులు కట్టలు తెంచుకుని దిగువనున్న ప్రాంతాలను ముంచెత్తే అవకావం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా నేపాల్‌లో భారీ వర్షాలు అలజడి సృష్టిస్తున్నాయి. ఆకస్మిక వరదలు ఊళ్లను ముంచెత్తుతున్నాయి. ఉధృతంగా ప్రవహించిన భోటేకోశీ నది నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. టిబెట్ వైపు నుంచి వచ్చిన ఆకస్మిక వరదల కారణంగా పలు ఊళ్లు, బ్రిడ్జులు, ప్రాజెక్టులు నీటిలో కొట్టుకుపోయాయి. వరద బీభత్సం కారణంగా బుధవారం ఉదయం రసువా జిల్లాలో 1000 మంది నీటిలో కొట్టుకుపోయారని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదలో కొట్టుకుపోయిన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ
ప్రాతిపదికన సహాయ చర్యలు మొదలయ్యాయి. అధికారులు 15 హెలికాప్టర్లను రంగంలోకి దించారు. సహాయక సిబ్బంది బుసి, తుసు ప్రాంతాల్లో 20 మందిని రక్షించారు. గాయపడ్డ వారిని మచిలి ట్రైనింగ్ క్యాంప్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారు వెంటనే అక్కడినుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అధికారులు ఇప్పటి వరకు 8 మృతదేహాలను నీటినుంచి స్వాధీనం చేసుకున్నారు.

# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయ వాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే కోదాడ ప్రభుత్వా స్పత్రికి తరలించారు.

### కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు మృతి

**సూర్యాపేట (కోదాడ) ఆగస్టు 26 మనసాక్షి**

తెలంగాణలోని సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట సమీపంలో ఇవాళ తెల్లవారు జామున ఎన్హెచ్-65పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కంటైనర్ లారీ అదుపుతప్పి డివైడర్ ను ఢీకొని.. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణీకులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ప్రైవేట్ ట్రావెల్స్ కు చెందిన 'అభి' బస్సు 42 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి ఏలూరు వైపు వెళ్తోంది. బస్సు కోదాడ మండలం ద్వారకుంట సమీపంలోకి రాగానే కంటైనర్ లారీ అదుపుతప్పి డివైడర్ ను ఢీకొని.. ఆ తర్వాత బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ఎన్టీఆర్

**భారీగా నిలిచిన ట్రాఫిక్**

ప్రమాదం జరగడంతో జాతీయ రహదా రిపై భారీగా ట్రాఫిక్ స్తంభించి పోయింది. పోలీసులు, హైవే పెట్రో లింగ్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ను క్రమ బద్దీకరించి వాహనాల రాకపోక లను పునరుద్ధరించారు. ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు వ్యక్తు లు మృతి చెందడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, ఏపీ-డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తెలంగాణ, ఏపీ మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.








# ఆధ్యాత్మిక పిఠాపురానికి అభివృద్ధి వెలుగులు

మంగళగిరి: ఆధ్యాత్మికత కొలువైన క్షేత్రంలో అభివృద్ధి ఉండాలి.. చరిత్ర ఉన్న చోట పరిరక్షణ ఉండాలి.. సంస్కృతి ఉన్న చోట అది మరింత శోభిల్లాలి" అనేది ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ దృఢ సంకల్పం. పిఠాపురం నియోజకవర్గ చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుతూ, ఆ వైభవాన్ని భవిష్యత్ తరాలకు మరింత ఘనంగా అందించాలనే ఆయన కార్యాచరణ ఇప్పుడు క్షేత్రస్థాయిలో రూపుదాలుస్తోంది. పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రత్యేక చొరవ తీసుకొని, నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి , భజన మందిరాల నిర్మాణం, కళ్యాణ మండపాల ఏర్పాటు కోసం ఏకంగా రూ. 30.66 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఆయన నిరంతర పర్యవేక్షణలో ఈ అభివృద్ధి పనులు ప్రస్తుతం నియోజకవర్గవ్యాప్తంగా శరవేగంగా జరుగుతున్నాయి.

నియోజకవర్గంలోని 24 ప్రముఖ దేవాలయాల అభివృద్ధి కోసం రూ.17.06 కోట్ల నిధులను కేటాయించారు. ఈ నిధులతో ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ, మరమ్మతులతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. గొల్లప్రోలు సీతారామస్వామి ఆలయంలో ప్రాకార మండపం నిర్మాణం తుది దశకు చేరింది. కొత్తపల్లిలోని జగన్నాథ, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన పనులు పూర్తయ్యాయి. పిఠాపురం కొత్తపల్లి వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుల క్వార్టర్ల స్లాబ్ పనులు పూర్తయ్యాయి. శ్రీ కుంతీ మాధవస్వామి ఆలయంలో కాలక్షేప మండపం, రామకృష్ణాపూర్ సూర్యనారాయణ స్వామి ఆలయంలో రాజగోపురం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కుక్కుటేశ్వర స్వామి ఆలయానికి రూ.5 కోట్లు, శ్రీ పాద శ్రీవల్లభ దేవస్థానానికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు మొదలు కానున్నాయి. పునరుద్ధరణ జరుగుతున్న ఆలయాల్లో శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ముఖ్యంగా పిఠాపురంలోని పంచ మాధవ క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన 10వ శతాబ్దం నాటి శ్రీ కుంతీమాధవ స్వామి ఆలయంతోపాటు, పిఠాపురం మహారాజుల కాలం నాటి అనేక పురాతన దేవాలయాలు ఈ ప్రాజెక్టు ద్వారా సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలోని పుణ్యక్షేత్రాలకు ఏటా సుమారు 13.76 లక్షల నుంచి 18.07 లక్షల మంది భక్తులు వస్తుంటారు. సాధారణ రోజుల్లోనే కాకుండా పండుగలు, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాల సమయంలో భక్తుల రద్దీ మరింత పెరుగుతుంది. ఆయా పర్వదినాల్లో రోజుకు 20 వేల నుంచి ఏకంగా 50 వేల మంది వరకు భక్తులు తరలివస్తుంటారు. ఈ భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల ఆధునీకరణ పనులు చేపడుతున్నారు.

# 22ఏను వెంటనే తొలగించాలి




హైదరాబాద్: కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ పాలన భూముల కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు న్యాయం చేసే బాధ్యత తమపై ఉందని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములన్నీ అమ్ముకుంటూ.. భావి తరాలకు జాగా లేకుండా చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల ఆస్తులనేమో 22-ఏ నిషేధిత జాబితాలోకి.. ప్రభుత్వ భూములనేమో రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని ఆక్షేపించారు. లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు కమీషన్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో.. ఎప్పుడు 22-ఏ కింద భూమి లాక్కుంటారోనని ప్రజలు భయపడుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను, హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22-ఏలో చేర్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ 30 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో 22-ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. బ్రోకర్లకు ఎవరూ ఒక్క రూపాయి ఇవ్వొద్దని.. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత బీఆర్ఎస్‌దేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం జరిగింది. కేపీహెచ్‌బీ ఎస్ఆర్ఎస్ఏ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో బాధితులతో హరీశ్‌రావు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సెక్షన్ 22ఏ తీసుకొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రజలు కేంద్రంగా పరిపాలన కొనసాగిందని తెలిపారు. అదే రేవంత్ పాలనలో భూములు కేంద్రంగా పరిపాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఏం కావాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు, 24 గంటల కరెంటు అందించారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కేసీఆర్ తపన పడ్డారని చెప్పారు. కేసీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచారని అన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చారని తెలిపారు. దేశానికే తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని పేర్కొన్నారు.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక
గుంటూరు
గురువారం, 27 ఆగస్టు 2026 వార్తలు

# అవినీతిని అడ్డుకున్నందుకే నాపై దుష్ప్రచారం

**డీసీఎంఎస్ చైర్మన్ వడ్డాణం హరిబాబు**
**శనగల కేంద్రంలో అవకతవకలకు పాల్పడిన వ్యక్తితోనే కుట్రపూరిత ఆరోపణలు**
**రూ. 100 కోట్లకు డీసీఎంఎస్ టర్నోవర్..**
**రూ. 50 లక్షల అక్రమాల రికవరీ**



**గుంటూరు, 26 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** డీసీఎంఎస్ (DCMS) సంస్థను అవినీతి రహితంగా తీర్చిదిద్ది, నష్టాల నుంచి లాభాల బాట పట్టిస్తుంటే ఓర్వలేక కొందరు స్వార్థపరులు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఉమ్మడి గుంటూరు జిల్లా డీసీఎంఎస్ అధ్యక్షుడు వడ్డాణం హరిబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనగల కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద ముడుపులు తీసుకున్నారనే ఫిర్యాదులపై శాఖాపరమైన విచారణ ఎదుర్కొంటున్న యేసుదాస్ అనే తాత్కాలిక ఉద్యోగిని కొందరు ప్రలోభపెట్టి, కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు పంపి మీడియా ముందు తప్పుడు ఆరోపణలు చేయించారని ఆయన మండిపడ్డారు. గుంటూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వడ్డాణం హరిబాబు మాట్లాడారు. రోజుకు కేవలం రూ. 650 దినసరి వేతనం (నెలకు రూ. 15,000-రూ. 16,000) వచ్చే తాత్కాలిక పోస్టులకు రూ. 5 లక్షలు లంచం తీసుకున్నారనడం అత్యంత హాస్యాస్పదమని ఖండించారు. నియామకాల్లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యేల సూచనల మేరకే అర్హులకు అవకాశాలు కల్పించామని స్పష్టం చేశారు.

**సంస్థ ప్రగతి-సంస్కరణలు :** రూ. 100 కోట్లకు చేరిన టర్నోవర్: గతంలో రూ.70కోట్ల లోపు ఉన్న వార్షిక టర్నోవర్‌ను ఏడాది కాలంలోనే రూ. 100 కోట్లకు తీసుకెళ్లాం. రైతులకు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు అందించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అదనంగా 10 నుంచి 12 నూతన బ్రాంచీలను ప్రారంభించాం.

**రూ. 11 కోట్ల పాత బకాయిల వసూలు :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన రూ. 18 కోట్ల బకాయిల్లో సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రుల సహకారంతో రూ. 11 కోట్లను రికవరీ చేశాం.

**శాశ్వత ఆదాయ వనరుల నిర్మాణం :** నరసరావుపేటలో రూ. 4.5 కోట్లతో గోడౌన్, కాంప్లెక్స్ నిర్మించి నెలకు రూ. 2 లక్షల అద్దె సమకూర్చాం. గుంటూరు ఏటుకూరు రోడ్డులో 'చంద్రన్న రైతు కన్వెన్షన్ సెంటర్' ఏర్పాటుకు జనరల్ బాడీ ఆమోదం తీసుకున్నాం.

**అక్రమార్కులపై వేటు-రూ.50 లక్షల రికవరీ:** పిడుగురాళ్ల, మాచర్ల, నెమలిపురి, సత్తెనపల్లి తదితర బ్రాంచీల్లో ఆకస్మిక ఆడిట్‌లు నిర్వహించి గుర్తించిన రూ. 50 లక్షల నిధుల గోల్‌మాల్‌ను వారం రోజుల్లో రికవరీ చేయించాం. ఇప్పటికే ముగ్గురిని సస్పెండ్ చేశాం. ధాన్యం, పప్పుధాన్యాల ప్రొక్యూర్మెంట్ ద్వారా సంస్థకు రూ. 10.5 కోట్ల కమిషన్ సమకూర్చామని, ఉద్యోగుల భద్రత కోసం నెలకు రూ. 15 లక్షల శాశ్వత ఆదాయ మార్గాలను సిద్ధం చేశామని తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తానని హరిబాబు స్పష్టం చేశారు.

## వారం రోజుల్లో వీధి దీపాల ఫిర్యాదులను పరిష్కరించాలి



జీఎంసీ కమిషనర్ కె.మయూర్ అశోక్

**గుంటూరు, 26 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరంలో వీధి దీపాలకు సంబంధించి ప్రజల నుండి అందిన ప్రతి ఫిర్యాదునూ రాబోయే వారం రోజుల్లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో వీధి దీపాల నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలపై ఇంజినీరింగ్ విభాగ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత, కాల్ సెంటర్ మరియు గ్రీవెన్స్ ద్వారా వీధి దీపాలపై వచ్చిన ఫిర్యాదులను వార్డుల వారీగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఏ రోజుకారోజు వేగంగా పరిష్కరించాలన్నారు. ప్రతి ఏఈ తమ పరిధిలోని వార్డుల వారీగా వెలగని వీధి దీపాలను క్షేత్రస్థాయిలో సత్వరమే గుర్తించి, సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నగరంలో ఎక్కడైనా వీధి దీపాలు కావాలని ప్రజల నుండి ఫిర్యాదులు లేదా అభ్యర్థనలు వస్తే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్తంభాలు లేని చోట్ల ఏపిసిపిడిసిఎల్ అధికారులతో సమన్వయం చేసుకొని, నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు రాత్రి వేళల్లో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నగరమంతటా వీధిదీపాలు నిరంతరం వెలిగేలా చూడటంలో ఇంజినీరింగ్ అధికారులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈ విష్ణు, డిఈఈ శ్రీనివాస్, ఏఈ సాయితేజ పాల్గొన్నారు.

## రూ. 53.90 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, 26 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) పేదలకు భరోసా కల్పిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే 42 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.53,90,468ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యచికిత్స పొందలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న పలువురు ప్రజలు తమ కార్యాలయాన్ని ఆశ్రయిస్తుంటారని, వారికి ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫార్సులు చేసి లక్షలాది రూపాయల సహాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజలసంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు వైద్య చికిత్సల కోసం అందిస్తున్న ఈ సహాయం వారికి వరంలా మారిందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధి పొందిన ప్రజలు చంద్రబాబు నాయుడిని తమ ఇంటి పెద్ద కొడుకులా భావిస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారని చెప్పారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.8,63,48,081 ల కోట్లు ద్వారా ఆర్థిక సహాయం అందించగలిగామని, భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ పథకం ద్వారా సహాయం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.


## మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన "ఈద్ మిలాద్ ఉన్ నబీ" వేడుకలు



**గుంటూరు, 26 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన "ఈద్ మిలాద్ ఉన్ నబీ" వేడుకలు గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రశాం తంగా ముగిశాయని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ముస్లిం సోదరులకు ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్తను స్మరించుకుంటూ ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించి, వివిధ ప్రాంతాల్లో ర్యాలీలు చేపట్టారని తెలిపారు. గుంటూరు, తెనాలి పట్టణాలతో పాటు జిల్లాలోని వివిధ గ్రామాలు, ప్రాంతాల్లో నిర్వహించిన ర్యాలీలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాం తంగా ముగిశాయని ఎస్పీ తెలిపారు. ఈ వేడుకల సందర్భంగా మత సామరస్యానికి ప్రతీకగా ముస్లిం, హిందూ సోదరులు పర స్పర సహకారంతో నిలిచారని పేర్కొన్నారు. ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టిందని ఎస్పీ తెలిపారు. ముఖ్యమైన ప్రాంతాలలో ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించడంతో పాటు, మసీదుల వద్ద ముందుగానే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. వివిధ ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించనున్నట్లు ముందస్తు సమాచారాన్ని సేకరించి, ర్యాలీల మార్గాల్లో భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో పాటు ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. గుంటూరు నగరంలో ప్రశాంతంగా ముగిసిన ర్యాలీ : గుంటూరు నగరంలోని లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధి నుంచి ప్రారంభమైన ర్యాలీ హిందూ కాలేజ్, జిన్నా టవర్, పాత గుంటూరు, బస్టాండ్ ప్రాంతాల మీదుగా తిరిగి లాలాపేటకు చేరు కుంది. ర్యాలీలో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరు లు పాల్గొన్నప్పటికీ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధి కారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ర్యాలీ సందర్భంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా అవసరమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ర్యాలీల మార్గాల్లో పోలీసు బందోబస్తుతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పరి స్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ర్యాలీలు ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకున్నారు. ఈ బందోబస్తులో పలువురు సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విధులు నిర్వహించారు.

## ఘనంగా హైమా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవం





**గుంటూరు, 26 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరులో హైమా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ముఖ్య అతిథిగా హాజరై నూతన హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యే లు నక్కా ఆనంద్ బాబు, గల్లా మాధవి, మహ్మద్ నసీర్, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు తక్కువ ఖర్చుకే నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందడం హైమా హాస్పిటల్ ప్రత్యేకత అని ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు తెలిపారు. సాధారణ హాస్పిటల్ నుండి అత్యాధునిక సౌకర్యాలతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## కార్యకర్తల గ్రీవెన్స్ నిర్వహించిన ఎమ్మెల్యే గళ్లా మాధవి

**గుంటూరు, 26 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యకర్తల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించి, వారి నుండి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు తమ సమస్యలను వినిపించగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సంప్రదించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఏ.ఎన్.యు ఒప్పంద అధ్యాపకులు



**గుంటూరు, 26 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 15-20 సంవత్సరాలకు పైగా నిరంతరంగా సేవలందిస్తున్న ఒప్పంద అధ్యాపకుల ప్రతినిధులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా. సి.హెచ్. తిరుమలరావు, కార్యదర్శి డా. వై. సునీతతో పాటు అసోసియేషన్ సభ్యులు డా. ఎం. గోపీకృష్ణ, డా. డి. చంద్ర మౌళి, డా. పి. రవి, డా. సి.హెచ్. రవికుమార్, డా. ఆర్.ఎస్. శ్రీనివాస్, డా. కె.ఎస్. రాజశేఖర్, డా.యు.సతీష్, డా.డి.అఖిల జాన్, డా. జి. ప్రతిభ తదితరులు పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ధూళి పాళ్ల నరేంద్ర కుమార్ ని కార్యాలయంలో వ్యక్తిగతంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసన సభలో ఒప్పంద అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలను ప్రస్తావించి, యూజీసీ పే స్కేళ్ల అమలు, అసోసియేట్ ప్రొఫెసర్ మరియు ప్రొఫెసర్ పోస్టుల నియామకాల్లో ఒప్పంద అధ్యాపకుల సేవలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరంపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, ఒప్పంద అసిస్టెంట్ ప్రొఫెసర్ల వేతనాల పెంపుపై ఇటీవల సమర్పించిన కమిటీ నివేదిక/సిఫార్సుల ప్రకారం వేతనాలను పెంచేలా ప్రభుత్వంతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే ని కోరారు. ఒప్పంద అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుతంగా, ఐక్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఒప్పంద అధ్యాపకులు స్పష్టం చేశారు.

## కోబాల్ట్ పేటలో వరుస దొంగతనాలు

**గుంటూరు, 26 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరంలోని కోబాల్ట్ పేటలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు హడలెత్తిపోతున్నారు. నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, చోరీలను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఆ దిశగా పోలీసులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈమేరకు తాజాగా జరిగిన దొంగతనం కేసుకు సంబంధించి బాధితురాలు సాతులూరి రాజమ్మ, నవతరం పార్టీ అధ్యక్షురాలు పోకూరి కవిత బుధవారం మీడియాతో మాట్లాడారు. దొంగతనాలు చేస్తూ, దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.

## పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదంపై మంత్రి దిగ్భ్రాంతి




**అమరావతి, భారత్ ప్రతినిధి న్యూస్ :** పల్నాడు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిలకలూరిపేట వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు-ఆటో ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృతి చెందడం అత్యంత విషాదకరం. ప్రమాదాల వల్ల నిండు ప్రాణాలు మృత్యు ఒడికి చేరడం మనసును కలచివేస్తోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణాలు గమ్యానికి చేర్చాలి కానీ, ఆఖరి మజిలీకి కాదు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# పేదల సొంతింటి కలపై నాసిరకం పిడుగు

పేరేచర్ల జగనన్న కాలనీల్లో
బయటపడ్డ నిలువెత్తు నిర్లక్ష్యం
కోట్ల రూపాయల ప్రజాధనం
కాంట్రాక్టర్ల పాలు..
నాణ్యతలేక శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ఇళ్లు
కనీస వసతులు లేక వెలవెలబోతున్న లేఅవుట్..
గత పాలకుల దోపిడీపై సమగ్ర విచారణ
చేపట్టాలి : సీపీఎం డిమాండ్





**గుంటూరు, 26 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామంటూ గత ప్రభుత్వం ఆర్భాటంగా చేసిన ప్రచారమంతా డొల్లేనని పేరేచర్లలోని జగనన్న కాలనీ (పీఎంఏవై) సాక్షిగా బట్టబయలైందని సీపీఎం గుంటూరు నగర కార్యదర్శి కె. నళినికాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం నిర్మాణాలతో గోడలు నెర్రలుబారి, పెచ్చులూడిపడుతూ ఒక్కరు కూడా అడుగుపెట్టలేని రీతిలో ఇళ్లన్నీ ధ్వంసమైపోయాయని మండిపడ్డారు. బుధవారం సీపీఎం నగర నాయకుల బృందం పేరేచర్ల లేఅవుట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

**పేదలకు శూన్యం.. నాయకులు, కాంట్రాక్టర్లకే లబ్ధి :** రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద లేఅవుట్‌గా పేరు చెప్పుకున్న పేరేచర్లలో పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని నళినికాంత్ ధ్వజమెత్తారు. కోట్ల రూపాయల నిధులు వెచ్చించినా, నాణ్యతా ప్రమాణాలు గాలికొదిలేయడంతో నిర్మాణాలు అప్పుడే శిథిలాలుగా మారాయని ఆరోపించారు. సొంతంగా అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్న కొద్దిమంది లబ్ధిదారులు సైతం.. తాగడానికి చుక్క నీరు లేక, మురుగునీటి పారుదల, అంతర్గత రహదారులు వంటి కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఆ ఇళ్లను వదిలేసి వెళ్లిపోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**అవినీతి తిమింగళాలపై చర్యలు తీసుకోవాలి :** గత ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన భారీ అవకతవకలు, నిధుల దోపిడీపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి దోషులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. నిరుపయోగంగా మారిన పేరేచర్ల కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, విద్యుత్ వ్యవస్థలను తక్షణమే పూర్తి చేసి నివాసయోగ్యంగా మార్చాలి. ఇళ్లు అసంపూర్తిగా ఉన్న అర్హులైన పేదలకు తక్షణమే అదనపు ఆర్థిక సాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి. ఈ క్షేత్ర స్థాయి పరిశీలనలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి. ముత్యాలరావు, నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కె. శ్రీనివాసరావు, నగర కమిటీ సభ్యులు షేక్ ఖాశింషహీద్, షేక్ బాషా, షేక్ ఖాశింవలి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనగర్ లో రూ.8:50 కోట్లతో అధివృద్ధి పనులకు శంకుస్థాపన

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే,
అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్



**గుంటూరు, 26 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్ల కాలంలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సుమారు 100 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, స్థానిక సంస్థల్లో కూటమిని బలపరిస్తే మరింత ప్రగతి సాధించే అవకాశం ఉంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో 8:30 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. తొలుత డొంక రోడ్డు నుంచి శ్రీనగర్ ఏడో లైన్ వరకు బైకులు, కార్లతో కూటమి నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీనగర్ లో రూ.7 కోట్లు, వసంతరాయపురంలో రూ.1.50 కోట్లతో సిసి రోడ్లు డ్రైన్లు పైపులైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ,గత వైసీపీ పాలనలో కార్పొరేషన్ నిధులను దోచుకుతింటే, తమ ప్రభుత్వంలో ప్రతి రూపాయిని ప్రజలకు జవాబుదారీగా పని చేస్తున్నామని తెలిపారు. కేవలం రెండేళ్లలోనే అద్భుతమైన ప్రగతి సాధించామని, స్థానిక సంస్థల్లో పూర్తిస్థాయి మెజారిటీ అందిస్తే రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మేలు చేసే అవకాశం కలుగుతుందని చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి కూటమి ప్రభుత్వానికి మద్దతు అందించాలని కోరారు. కార్పొరేషన్ లో కూటమికి తగినంత బలం చేకూరిస్తే గుంటూరు నగరానికి మహర్దశ వస్తుందన్నారు.. ఇప్పటికే అంతర్గత రోడ్లు, డ్రైన్, వాటర్ పైపులైన్లు నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. నగరంలోని మురుగునీరు బయటకు పోయేందుకు డ్రైన్ల నిర్మాణం చేపట్టామన్నారు. 28 కిలోమీటర్ల మేర నూతన రోడ్లు నిర్మించామని తెలిపారు. నందివెలుగు రోడ్డు, కాకాని రోడ్డు, ఏటుకూరు రోడ్డు, సిఆర్ నగర్ వంటి ప్రాంతాల్లో డ్రైయిన్లు అనుసంధానం చేశామని చెప్పారు. రాబోయే రోజుల్లో రూ.200 కోట్ల నిధులు నగరాభివృద్ధికి రానున్నాయని, దీంతో గుంటూరు రూపురేఖలు మార్చబోతున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలియజేసారు.

# ఆలా - పీఆర్ - ఏటుకూరిల ఉద్యమ ప్రస్థానం స్ఫూర్తిదాయకం



సంస్మరణ సభలో ముప్పాళ్ళ నాగేశ్వరరావు






**గుంటూరు, 26 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ప్రజల కోసం, ప్రజా ఉద్యమాల కోసం తమ జీవితాలను అంకితం చేసిన కమ్యూనిస్టు ఉద్యమ నేతలు అలానాగేశ్వరరావు, పీఆర్ ప్రకాష్ రావు , ఏటుకూరి ప్రసాద్ ల ఉద్యమ ప్రస్థానం నేటితరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. ఐదారు దశాబ్దాల పాటు భారత కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సంఘాల అభ్యున్నతికి వారు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. గుంటూరు మల్లయ్య లింగం భవన్లోని వీఎస్కే హాలులో సీపీఐ, రైతు, కార్మిక ఉద్యమ నేత అలా నాగేశ్వరరావు, శాంతి, స్నేహ సంఘం నాయకులు పీఆర్ ప్రకాష్ రావు, అరసం నేత, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పూర్వ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్ల సంస్మరణ సభ సీపీఐ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన సభలో ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో గర్వించదగిన కమ్యూనిస్టు ఉద్యమ నాయకుల్లో ఈ ముగ్గురు నాయకులు ఉంటారని, పార్టీ రాజకీయ, సైద్ధాంతికత పట్ల నిబద్ధత కలిగి అంకితభావంతో పనిచేసేవారని అన్నారు. ప్రజా ఉద్యమాలకు, రైతు-కార్మిక పోరాటాలకు, అభ్యుదయ సాహిత్య రంగానికి ముగ్గురు నేతలు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఏటుకూరి ప్రసాదు తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగాలకు విశేష సేవలందించారన్నారు. అభ్యుదయ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని చెప్పారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదక బాధ్యతలు నిర్వహించిన సమయంలో ప్రజా సాహిత్యానికి, ప్రగతిశీల రచనలకు ప్రాధాన్యం కల్పిస్తూ అనేక రచనలు, పుస్తకాలు పాఠకులకు చేరువయ్యేలా కృషి చేశారన్నారు. అరసం నేతగా రచయితలు, కవులు, కళాకారులను ప్రజా సమస్యలపై స్పందించేలా ప్రోత్సహించారని తెలిపారు. అదే విధంగా శాంతి, స్నేహ ఉ ద్యమ నేత పీఆర్ ప్రకాశ్ రావు ప్రజా ఉద్యమాలకు, శాంతి-సౌభ్రాతృత్వ పరిరక్షణకు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రజల్లో మానవతా విలువలు, పరస్పర స్నేహ భావం, సామరస్యాన్ని పెంపొందించేందుకు ఆయన నిరంతరం కృషి చేశారని తెలిపారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ సామాజిక బాధ్యతతో పనిచేశారన్నారు. అలా నాగేశ్వరరావు నిరాడంబర జీవితం, ఉద్యమ నిబద్ధత, ప్రజల పట్ల అంకితభావం కార్యకర్తలకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. పార్టీ కార్యకర్తలకు, యువతకు ఉద్యమ స్ఫూర్తిని అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ చరిత్రలో ముగ్గురు మూడు మచ్చుతునకలని అన్నారు. గుంటూరు జిల్లా ఉద్యమ నేపథ్యంలో వారిపాత్ర మరువలేనిదన్నారు. అరసం నేత ఏటుకూరి ప్రసాద్ ప్రజాస్వామ్య రక్షణకు రాసిన పాట నేటికి అందరి నోట నానుతుందన్నారు. అదేవిధంగా గుంటూరు ఏఐటీయూసీ చరిత్రలో పుష్కరకాలం పాటు సేవలందించిన అలా నాగేశ్వరరావు అనేక పోరాటాలు, ఉద్యమాలలో గణనీయమైన పాత్ర పోషించారని గుర్తుచేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్కుమార్ మాట్లాడుతూ అలా నాగేశ్వరరావు లేకుంటే గుంటూరు నగర ఏఐఎస్ఎఫ్ చరిత్ర లేదని స్పష్టం చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకునిగా ఆనాడు ఆయన సాగించన పోరాటాలు ఎన్నటికీ మరువలేనివన్నారు. విద్యార్థి ఉద్యమాలలో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించన సందర్భాలు అనేకం ఉన్నాయని చెప్పారు. మిగిలిన నేతలతో కూడా తనకున్న అనుబంధాన్ని జంగాల గుర్తుచేసుకున్నారు. ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు వల్లూరు తాండవ కృష్ణ, మాజీ కౌన్సిలర్ డాక్టర్ మామిళ్ళపల్లి అరుణ, హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు, సెంట్రల్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ రాము, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జొన్నలగడ్డ వెంకటరెడ్డి తదితరులు ప్రసంగించారు. తుదిశ్వాస వరకు తాము నమ్మిన సిద్ధాంతానికి వారు కట్టుబడి పనిచేశారని, వారి మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. తొలుత సీపీఐ నగర కార్యదర్శి అకిటి అరుణ్ కుమార్ వక్తలను వేదికపైకి స్వాగతం పలికారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు ముగింపు ఇచ్చారు. ఈ సభలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# ఐజేఎం అపార్ట్మెంట్ ల్లో అనుమతి లేకుండా ఓ సినిమా షూటింగ్

షూటింగ్ తీయటంపై స్థానిక
అపార్ట్మెంట్ వాసులు తీవ్ర ఆగ్రహం
100 కి కాల్ చేసిన అపార్ట్మెంట్ వాసులు
ఇళ్ళ మధ్యలో అది గేటేడ్ కమ్యూనిటీలు ఉండే
చోట ఎలా అనుమతి లేకుండా సినిమా
షూటింగ్ చేస్తున్నారంటు ప్రశ్నిస్తున్నారు ?



**గుంటూరు/పెద్దకాకాని, 26 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గత కొద్ది రోజులుగా ఇదే విషయంను ప్లాట్ల యజమానులు, నివాస గృహాల మధ్య అనుమతి తీసుకోకుండా ఎలా షూటింగ్ అని నిలదీశారు. సినిమా నిర్వాహకులు అనుమతి లేకుండా తమ పనులు చేయటంతో విషయం సృతిమించటంతో స్థానికులకు, షూటింగ్ నిర్వాహకులకు స్వల్ప ఘర్షణకు తావిచ్చింది. తాము ఎదైనా చిన్న ఫంక్షన్ పెట్టుకుంటే వంద కారణాలు, అధిక మొత్తంలో డబ్బులు తీసుకునే రిసివర్ ఇప్పుడు కేవలం నామమాత్రంగా ఎలా డబ్బులు తీసుకొని వారి అనుమతి ఇచ్చారో అంటు ప్రశ్నిస్తున్నారు. అనుమతి తీసుకోకుండా సరైన వస్త్ర దారుణ లేకుండా ఇలా చేయటంపై స్థానికులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లిఫ్ట్ లో సామర్థ్యంకు మించి షూటింగ్ సామగ్రి తీసుకురావటంతో తీవ్ర అవస్థలు పడుతున్న ప్లాట్ల యజమానులు, నివాస గృహాల వారు తరచూ లిఫ్ట్ అగిపోతొందని ఆగిన సమయంలో చిన్నపిల్లలు, వృద్ధులు ఉంటే పరిస్థితి ఏంటో అని ప్రశ్నిస్తున్నారు. కోర్టు ఓ వ్యక్తి కేవలం మెయింటైన్ చేయమని చెపితే అతను అతని ఇష్టారాజ్యంగా చేస్తు ఇలా అనుమతులు ఇచ్చి తమను ఇబ్బంది పెడుతున్నారంటు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు విషయంపై తమ అభ్యంతరాలను కూడా తెలియజేశామని అయినా రిసివర్ షూటింగ్ వారికే మద్దత్తుగా ప్లాట్ ఓనర్స్ కు వ్యతిరేకంగా ఉన్నాడని విమర్శించారు. తక్షణమే సమస్య పరిష్కారం కాకపోతే సినిమా షూటింగ్ అపకపోతే తగిన రీతిలో గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. పెద్దకాకాని పోలీస్ లు వచ్చి షూటింగ్ వారికి మద్దతుగా సర్దుకోవాలని అపార్టుమెంట్ వాసులకు తెలపటం విశేషం. ఈ ఘటనపై ఎలాంటి చర్యలు ఉంటాయో..! ఆ షూటింగ్ అపుతారో లేక తమకు అడ్డులేదని ముందుకు పోతారో ?

## గుంటూరు శిల్పారామంలో హస్తకళల దుకాణాలు



**గుంటూరు, 26 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరంలో హస్తకళల నిలయమైన శిల్పారామంలో హస్తకళల అమ్మకానికి అనువైన దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి యశ్వంత్ సాయి ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత, హస్తకళల కళాకారులు ప్రోత్సహించి వారి ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించి నేరు గా విక్రయించుకునేందుకు, ప్రజలకు అందుబాటులో ఉండేలా శిల్పారామంలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి గల చేనేత, హస్తకళల కళాకారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ ఉత్పత్తుల ప్రదర్శనకు, అమ్మకాలకు ఉపయోగించుకోవాలని శిల్పారామం పరిపాలనాధికారి కోరారు. మరింత సమాచారం కొరకు యశ్వంత్ సాయి, శిల్పారామం కార్యాలయం, ఫోన్ నంబరు 8886652043 సంప్రదించవచ్చని వివరించారు.

## ప్రేమతో చేసే సేవే మానవత్వానికి నిజమైన ప్రతిరూపం



**అమరావతి, 26 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** తెరిసా ప్రేమతో చేసే సేవే మానవత్వానికి నిజమైన ప్రతిరూపమని చెప్పిన మదర్ తెరిసాను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు నడవాలని జన చైతన్య సమితి మహిళా కోఆర్డినేటర్ షేక్ జుబేదా ఖాతూన్ అన్నారు. అమరావతిలోని జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రంలో బుధవారం మదర్ తెరిసా 116వ జయంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరుణ నిస్వార్థ సేవకు మారుపేరుగా నిలిచిన మదర్ తెరిసాను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మానవత్వమే నిజమైన మతం అని తన జీవితంలో చూపించిన మదర్ తెరిసా సేవలు ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ముందుగా మదర్ తెరిసా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కూరపాటి రాజ్యలక్ష్మి ,పఠాన్ పర్వీన్, షేక్ కరీనా,పఠాన్ కరిష్మా, జనామాల కుమారి,షేక్ నగీన తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో తీవ్ర కరవు పరిస్థితులు

కుంభకర్ణుడిలా నిద్ర పోతున్న చంద్రబాబు
: వైయస్ జగన్ ఫైర్
ఈ ఖరీఫ్‌లో ఇప్పటికే ఎకరాకు
రూ.15 వేల నష్టం
అయినా సీఎం ఏ మాత్రం
పట్టించుకోని వైనం : వైయస్ జగన్



**తాడేపల్లి, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్రంలో తీవ్ర కరవు పరిస్థితులు నెలకొన్నా కుంభకర్ణుడిలా నిద్ర పోతున్న సీఎం చంద్రబాబు, కరవును ఎదుర్కోవడానికి కనీసం ప్లాన్ సిద్ధం చేయలేదని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. జూలై నాటికే కరవు పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నా, డెల్టాకు నీరిస్తామంటూ ప్రభుత్వం ఆర్భాటంగా చేసిన ప్రచారం వల్ల, నమ్మిన రైతులు సాగుకు దిగారని, ఇప్పుడు తీవ్ర కరవు పరిస్థితులు రావడంతో నారుమళ్లు సైతం ఎండి పోతున్నాయని, అయినా ప్రభుత్వం నుంచి ఏ విధమైన కార్యాచరణ లేకపోవడం వల్ల, రైతులు ఇప్పటికే ఎకరాకు రూ.15 వేల మేర నష్టపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా సీఎం చంద్రబాబు, సమస్యను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు.

**సీమ ప్రాజెక్టుల్లో అడుగంటిన నీరు :** తెలుగుగంగ కెనాల్ మీద ఆధారపడి ఉన్న వెలుగోడు, బ్రహ్మసాగర్, సోమశిల, కండలేరు ప్రాజెక్టుల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 180 టీఎంసీలు అయితే, ఇప్పుడు (ఆగస్టు 25న) వాటన్నింటిలో కలిపి 55 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. అందులో డెడ్ స్టోరేజ్ దాదాపుగా 14 టీఎంసీల దాకా తీసేస్తే ఇక అందుబాటులో ఉన్న నీరు కేవలం 41 టీఎంసీలు మాత్రమే. అంటే కేవలం 23 శాతం నీళ్లు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండే పరిస్థితి అని జగన్ వెల్లడించారు.

# కోడెల మృతి కారకులపై చర్యలు తప్పవు

## గోశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించిన ఆది

**వేములవాడ,ఆగస్ట్26 :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ తిప్పాపూర్ గోశాలలో ఐదు కోడెలు మృతి చెందాయి. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. గోశాల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గోశాలలో కోడెల సంరక్షణ, నిర్వహణపై అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో తిప్పాపూర్ గోశాలను బుధవారం ఆది శ్రీనివాస్ సందర్శించారు. గోశాలలో పరిస్థితులను పరిశీలించి, కోడెలకు అందుతున్న సంరక్షణ, ఆహారం, వైద్య సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా గోశాల నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో 40 ఎకరాల్లో ఆధునిక గోశాల నిర్మించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న కోడెల సంఖ్యకు అనుగుణంగా గోశాల సామర్థ్యాన్ని పెంచుతున్నామని తెలిపారు. అవసరమైన మేరకు కోడెలను ఇతర ప్రాంతాలకు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. భక్తులు సమర్పించే నిజ కోడెలను గోశాలకు తీసుకువచ్చిన వెంటనే ప్రత్యేకంగా క్వారంటైన్‌లో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా వచ్చే కోడెల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన తర్వాతే వాటిని ఇతర కోడెలతో కలపాలని సూచించారు. దీనివల్ల వ్యాధుల వ్యాప్తిని అరికట్టే అవకాశం ఉంటుందని ఆది శ్రీనివాస్ తెలిపారు. అలాగే, పాలు మానేసిన కోడెలను మాత్రమే భక్తులు స్వామివారికి సమర్పించాలని ఆది శ్రీనివాస్ సూచించారు. గోశాలలో కోడెలకు మెరుగైన సంరక్షణ అందించడంతో పాటు భక్తుల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు. దు కోడెల మృతికి గల కారణాలపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

# కుక్కల బాధకు.. రంగునీళ్ల సీసాలు

## వేములవాడలో ప్రజల వినూత్న ప్రయోగం

**వేములవాడ,ఆగస్ట్26 :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని గాంధీ నగర్ వీధిలో ఏ ఇంటి ముందు చూసిన రంగు నీళ్ల డబ్బాలే దర్శనమిస్తున్నాయి. ఇదేమిటి అబ్బా అని అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే వీధి కుక్కల బాధ నుండి తప్పించుకునేందుకు రంగు నీళ్ల డబ్బాతో వినూత్న ప్రయత్నానికి దిగినట్లుగా తెలిసింది. అయితే వీధి కుక్కలు కాలనీలో విచ్చలవిడిగా తిరుగుతూ ఇంటి ముందున్న చిన్నారులను వృద్ధులను గాయపరచడమే కాకుండా ఇంట్లోకి చొచ్చుకు వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ముందు ఈ రంగు నీళ్ల డబ్బా పెట్టడంతో ఇంటి వైపు కుక్కలు రావడం లేదని ప్రస్తుతం ప్రశాంతంగా ఉంటున్నామని కాలనీవాసులు వెల్లడించారు. శునకాల బాధకు రంగు నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడగా ప్రతి ఇంటి ముందు రంగు నీళ్ల డబ్బా దర్శనం ఇస్తోంది.

# వ్యక్తి ఆత్మహత్యా యత్నం..

## సకాలంలో కాపాడిని పోలీసులు

**నిజామాబాద్,ఆగస్ట్26 :** జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించడంతో వారు వచ్చి కాపాడారు. ఈ ఘటన ధర్పల్లి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ధర్పల్లి మండల కేంద్రంలోని కాలనీకి చెందిన మందుల గణెళిష్ కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది, చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఈ విషయం 100 డయల్‌కు సమాచారం అందడంతో వెంటనే పోలీసు సిబ్బంది స్పందించారు. సమాచారం తెలుసుకున్న దర్పల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ నరేందర్ వెంటనే చెరువు వద్దకు చేరుకుని, ప్రాణాపాయ స్థితిలో చెరువులో ఉన్న గణెళిష్‌ను గుర్తించి, చెరువులోకి దిగి అతడిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చి ప్రాణాలు కాపాడారు. కానిస్టేబుల్ నరేందర్ సమయస్ఫూర్తితో స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడినందుకు పోలీసు అధికారులు ఆయనను అభినందించారు.

# మొరాయించిన యంత్రం

## బియ్యం పంపిణీలో ఇబ్బంది

**కొత్తగూడెం,ఆగస్ట్26 :** సర్వర్ మొరాయించడంతో రేషన్ బియ్యం పంపిణీ నిలిచిపోయి లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. బుధవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఇరవెండి గ్రామ పంచాయతీలోని రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులు రేషన్ బియ్యం కోసం వెళితే వేలిముద్రలు తీసుకునే యంత్రం మొరాయించింది. దీంతో గంటల కొద్దీ లబ్ధిదారులు రేషన్ బియ్యం కోసం వచ్చి పడిగాపులు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ గుండి బాబూరావు, మహంకాళి రామారావు దుకాణం వద్దకు వెళ్లి లబ్ధిదారుల ఇబ్బందులను గమనించి డిప్యూటీ తాసీల్దార్‌కు సమాచారం ఇచ్చి ఆయనను అక్కడకు పిలిపించి పరిస్థితిని వివరించారు. ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇస్తుండగా సర్వర్ పనిచేయకపోవడం, ఈ నెల 30వ తేదీ వరకే గడువు ఉండడంతో రేషన్ అందని లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి అర్హుడికి బియ్యం అందేవరకు రేషన్ పంపిణీని ఆపవద్దని సర్పంచ్, ఉపసర్పంచ్ అధికారులను కోరారు.

# పార్టీ జెండాలు ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చ

**కొత్తగూడెం,ఆగస్ట్26:** బీఆర్ఎస్ పార్టీకి గ్రామాల్లో కార్యకర్తలే పునాదిరాళ్లు వంటి వారిని అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం మద్దుకూరు, రావికంపాడు గ్రామాల్లో గ్రామ కమిటీల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పార్టీ దిమ్మలను ప్రారంభించి పార్టీ జెండాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మెచ్చ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అలివిగానీ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. రైతులకు కనీసం ఎరువులు ఇవ్వలేని ప్రభుత్వం భేషరతుగా రైతాంగానికి క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం అయ్యన్నపాలెం గ్రామంలో అకస్మాత్తుగా మృతి చెందిన ఆటో డ్రైవర్ నాగులు మీరా కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, శ్రేణులు, గ్రామ, మండల కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

# సింగరేణికి మనమంతా రుణపడి ఉన్నాం

## సన్మాన సభలో సివిల్ ఏజీఎం సీహెచ్ రామకృష్ణ

**కొత్తగూడెం,ఆగస్ట్26 :** సింగరేణికి మనమంతా కష్టపడి పనిచేస్తే సంస్థ అభివృద్ధి చెందుతుంది. సంస్థ బాగుంటే మనమూ బాగుంటాం అని సింగరేణి కొత్తగూడెం ఏరియా సివిల్ ఏజీఎం సీహెచ్ రామకృష్ణ అన్నారు. ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న సందర్భంగా బుధవారం రుద్రంపూర్ సీఈఆర్ క్లబ్‌లో ఏరియాలో పని చేస్తున్న సుమారు 400 మంది కాంట్రాక్ట్ కార్మికులతో రామకృష్ణ దంపతులు, భోజనాలు ఏర్పాటు చేసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులు రామకృష్ణను ఘనంగా సన్మానించారు.

# 22ఏను వెంటనే తొలగించాలి

## లేకుంటే సచివాలయం ముట్టడిస్తాం

## భూకబ్జాల హైదరాబాద్ బ్రాండ్‌కు దెబ్బ

## రేవంత్ భూ అమ్మకాలతో బిజీ

## బిఆర్ఎస్ నేత హరీస్ రావు విమర్శలు



**హైదరాబాద్,ఆగస్ట్26 :** కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ పాలన భూముల కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు న్యాయం చేసే బాధ్యత తమపై ఉందని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములన్నీ అమ్ముకుంటూ.. భావి తరాలకు జాగా లేకుండా చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల ఆస్తులనేమో 22-ఏ నిషేధిత జాబితాలోకి.. ప్రభుత్వ భూములనేమో రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని ఆక్షేపించారు. లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు కమిషన్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో.. ఎప్పుడు 22-ఏ కింద భూమి లాక్కుంటారోనని ప్రజలు భయపడుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను, హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22-ఏలో చేర్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ 30 శాతం కమిషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో 22-ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. బ్రోకర్లకు ఎవరూ ఒక్క రూపాయి ఇవ్వొద్దని.. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత బీఆర్ఎస్‌దేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం జరిగింది. కేపీహెచ్‌బీ ఎస్ఆర్ఎస్ఏ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో బాధితులతో హరీశ్‌రావు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సెక్షన్ 22ఏ తీసుకొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రజలు కేంద్రంగా పరిపాలన కొనసాగిందని తెలిపారు. అదే రేవంత్ పాలనలో భూములు కేంద్రంగా పరిపాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఏం కావాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు, 24 గంటల కరెంటు అందించారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కేసీఆర్ తపన పడ్డారని చెప్పారు. కేసీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచారని అన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చారని తెలిపారు. దేశానికే తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హరియాణాలను తలదన్ని, దేశంలోనే అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే కాజేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాత్రికి రాత్రి భూములన్నీ నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గుండెమీద చెయ్యేసుకుని ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు హైడ్రా వస్తదో.. ఎప్పుడు సెక్షన్ 22ఏ వస్తదో అని భయంలో బతుకుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్ లో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని హరీశ్‌రావు కొనియాడారు. యావత్ దేశం హైదరాబాద్ వైపు చూసేలా కేసీఆర్ చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాక హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మంటగలిసి పోయిందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డివి తుగ్లక్ నిర్ణయాలు అని విమర్శించారు. అవసరం పడి అమ్ముకుందామంటే ఎవరైనా కొనే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. అమెరికాలో ఉన్న మనవాళ్లు ఇక్కడ ఇండ్లు కొనడం ఆపేశారని తెలిపారు. పైసలుంటే అమెరికాలోనే పెట్టుబడులు పెట్టుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చారని హరీశ్‌రావు తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను ఈ జాబితాలో పెట్టారని పేర్కొన్నారు. కాలనీలకు కాలనీలు 22ఏ జాబితాలోకి వెళ్లాయని అన్నారు. 98 శాతం భూములను తీసేశామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అబద్దాలు చెబుతున్నాడని అన్నారు. సెక్షన్ 22 ఏ కారణంగా చాలామందికి లోన్లు రాలేదని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు బాధపడాలని ప్రశ్నించారు. సెక్షన్ 22ఏ పెట్టింది మీరే.. తీసేయాల్సింది కూడా మీరే అని స్పష్టం చేశారు. ప్రజలు ఎందుకు దరఖాస్తులు పెట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాలని నిలదీశారు. మీ తప్పునకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. ప్రజలు ఎందుకు దరఖాస్తులు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాలని ప్రశ్నించారు. మీరే చేసిన తప్పునకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని అడిగారు. తప్పు చేసింది మీరు.. సరిదిద్దుకోవాల్సింది కూడా మీరేనని పునరుద్ఘాటించారు. ప్రజల నుంచి 30 శాతం కమిషన్లు గుంజుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి బ్రోకర్లు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఏజెంట్లు కాలనీల్లో తిరుగుతున్నారని తెలిపారు. ప్రజలు ఒక్క రూపాయి కూడా బ్రోకర్లకు ఇవ్వద్దని సూచించారు. మీ ఆస్తులను కాపాడి మీకు అప్పగించే బాధ్యత మాది అని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి అసెంబ్లీ మొదలవుతుందని తెలిపారు. అసెంబ్లీలో సెక్షన్ 22ఏపై పోరాడతామని పేర్కొన్నారు. కబ్జాదారులే ధర్నాలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం మెడలు వంచి మీకు న్యాయం చేసే బాధ్యత మాపై ఉందని చెప్పారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

# 28 నుంచి ఇందిరమ్మ ఇళ్ల లాటరీ

## రోజుకు నాలఅఉగు నియోజకవర్గాల్లో నిర్వహణ

**హైదరాబాద్,ఆగస్ట్26 :** ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో భాగంగా హైదరాబాద్ పరిధిలో నిర్మించనున్న ఇండ్ల కేటాయింపు లాటరీ పక్రియ ఈ నెల 28 నుంచి 31 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు చొప్పున 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు రోజుల పాటు ఈ పక్రియను చేపట్టనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ విపి గౌతం తెలిపారు. ఈ లాటరీ పక్రియనంతటినీ యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని, ఎటువంటి అనుమానాలు, అపోహలకు తావివ్వకుండా పూర్తి పారదర్శకంగా లాటరీ డ్రా తీసేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థలాభావం భద్రతా ఏర్పాట్లు తదితర కారణాల వలన లాటరీ కేంద్రాల్లోకి దరఖాస్తు దారులందరినీ అనుమతించలేమని, అయితే, ఆయా కేంద్రాల వద్ద లాటరీ జరుగుతున్న తీరును ప్రజలందరూ స్క్రీన్లపై వీక్షించేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. లాటరీ పక్రియ ప్రత్యక్ష ప్రసారాన్ని వెబ్ సైట్ లోనూ హౌసింగ్ డిపార్ట్‌మెంట్ సోషల్ మీడియా హ్యాండిల్స్ బిణరట.నౌతిఇతిజీ తో ఉన్న ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ ల ద్వారా చూడవచ్చని ఆయన వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ పథకం కింద ఇండ్లు కావాలనుకునే వారి నుంచి ఈ నెల 15 వరకు దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. వచ్చిన దరఖాస్తులన్నిటినీ పరిశీలించడమే కాకుండా, అనర్హులుగా గుర్తించిన వారి నుంచి అభ్యంతరాలను కూడా తీసుకుని పరిష్కరించినట్లుగా వైస్ ఛైర్మన్ వి పి గౌతం తెలిపారు.

# గుండెపోటుతో బిటెక్ విద్యార్థి మృతి

## జిన్నారం గ్రామానికి చెందిన వాడిగా గుర్తింపు

**హైదరాబాద్,ఆగస్ట్26 :** గుండెపోటుతో బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన హైదరాబాద్‌లో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన పోషన్న, నరసవ్వ దంపతుల కుమారుడు మనోహర్ (24) రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఓ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం గుండెపోటుతో మనోహర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పోషన్న నరసవ్వ దంపతులకు పిల్లలు లేకపోవడంతో మనోహర్‌ను దత్తత తీసుకున్నారు. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుతూ చదివిస్తున్నారు. ఈ నేపథ్యంలో మనోహర్ హఠాన్మరణంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

# విదేశీయుడి ఆత్మహత్యా యత్నం

## కాపాడిని సైఫాబాద్ పోలీసులు

**హైదరాబాద్,ఆగస్ట్26 :** హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన ఓ విదేశీయుడిని సైఫాబాద్ పోలీసులు రక్షించారు. సచివాలయం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న సైఫాబాద్ పోలీసులు.. గమనించి తాడు సాయంతో విదేశీయుడిని రక్షించారు. ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి టోలిచౌకి పారామౌంట్ కాలనీలో నివాసం ఉంటున్న సుడాన్ దేశానికి చెందిన నాజర్ ఆడమ్ బడా వేగా (25) గుర్తించారు. విచారణ నిమిత్తం లేక్ పోలీసులకు అప్పగించారు. ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలపై లేక్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

# జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు

**కుమ్రం భీమ్ ఆసిఫాబాద్,ఆగస్ట్26 :** జిల్లా వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తీవ్ర వరద పరిస్థితులు నెలకొన్నాయి. వర్షపు నీటితో జిల్లాలోని చెరువులు, కాలువలు పూర్తిస్థాయిలో నిండడమే కాకుండా, వాగులు , వంకలు ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వడంతో పాటు పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ క్రమంలో చింతల మానేపల్లి మండలంలోని దిందా, కేతుని గ్రామాల మధ్య ఉన్న లో-లెవల్ వంతెన పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాణాలకు తెగించి దాటవద్దని అధికారులు ఎంత హెచ్చరిస్తున్నప్పటికీ, పరిస్థితుల తీవ్రతను గమనించకుండా రోడ్లు దాటే ప్రయత్నాలు చేయడం వల్ల తీవ్రమైన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

# అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం

## చెట్టును ఢీకొన్న కారు....ముగ్గురు దుర్మరణం

## నిజామాబాద్‌కు చెందిన నవీన్ ఉన్నట్లు సమాచారం

**నిజామాబాద్,ఆగస్ట్26 :** అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు కుటుంబసభ్యులకు ఈ సమాచారం అందింది. ఉన్నత చదువుల కోసం మూడు నెలల క్రితం అమెరికా వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు హరిబాబు, నాగమణి కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువకులు మృతిచెందారని తెలుస్తోంది.. ఫ్లోరిడాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. మృతుల్లో నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ ఉన్నారు. రాహుల్ సుమారు మూడు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. ఉన్నత చదువులు లేదా ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన కొద్దికాలానికే రోడ్డు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మంగళవారం రాత్రి మొత్తం ముగ్గురు స్నేహితులు కలిసి కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కారు చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందినట్లు రాహుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాహుల్ మృతితో నవీపేట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మూడు నెలల క్రితమే అమెరికా వెళ్లిన యువకుడు ఇలా అనూహ్యంగా మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాహుల్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# నేపాల్‌లో ఆకస్మిక వరదలు

## వరదల్లో వందలాది మంది గల్లంతు

**అందులో 105 మంది భారతీయులున్నట్లు అంచనా**

**టిబెట్‌లో భారీ వర్షాలతో ఉప్పొంగిన కోశీనది**

**బురదమయంగా మారిన కొండతీర ప్రాంతం**



**ఖాట్మండ్:** నేపాల్‌లో బుధవారం ఉదయం అకస్మాత్తుగా ముంచుకొచ్చిన వరదలు అనేక మందిని పొట్టనపెట్టుకున్నాయి. 105 మంది భారతీయులు కూడా ఈ విపత్తులో గల్లంతయ్యారు. ఓ అంచనా ప్రకారం 1500 మంది గల్లంతయ్యారని అంటున్నారు. చైనాతో సరిహద్దుకు సమీపంలోని రసువా జిల్లాలోని భోటే కోశీ నదిలో ఒక్కసారిగా వరద పోటెత్తడంతో తీరంలోని అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో నేపాల్‌కు దిగువన ఉన్న బిహార్, యూపీ రాష్ట్రాలు కూడా అప్రమత్తమయ్యాయి. మరోవైపు, ఈ అకస్మిక వరదలకు కారణం ఏంటో తెలుసుకునేందుకు నేపాల్ అధికారులు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. ఆకస్మిక వరదలు కేవలం గంటల వ్యవధిలోనే విరుచుకుపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఒక్కసారిగా భారీ స్థాయిలో కుండపోత వర్షం కురిసినా, లేదా నదీప్రవాహానికి అడ్డుగా ఉండే కొండచరియలు విరిగి పడిన సందర్భాల్లో కూడా ఆకస్మిక వరదుల దిగువన ఉన్న ప్రాంతాలను ముంచెత్తుతాయి. కొండల్లోని మంచు కరగడంతో ఏర్పడే గ్లేషియల్ సరస్సులు అస్థిరమై ఒక్కసారిగా కిందకు దూసుకొచ్చిన సందర్భాల్లో కూడా లోతట్టు ప్రాంతాలను ఆకస్మిక వరదలు ముంచెత్తుతాయి. అంతెత్తున ఉండే కొండల నుంచి కిందకు వేగంగా దూసుకొచ్చే నీటి ప్రవాహానికి తన దారిలో ఉన్న అన్ని నిర్మాణాలను నేలమట్టం చేయగల శక్తి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, రసువా జిల్లాలో వర్షాలకు అవకాశం తక్కువని అక్కడి వాతావరణ శాఖ ముందే అంచనా వేసింది. కానీ నేపాల్‌కు ఎగువన ఉన్న టిబెట్‌లో భారీ వర్షం కురిసిన విషయం శాటిలైట్ చిత్రాల్లో బయటపడ్డట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయమై తమను ముందస్తుగా హెచ్చరించడంలో చైనా విఫలమైందని ఇప్పటికే నేపాల్ జర్నలిస్టు ఒకరు నెట్టింట తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిమాలయాల్లో ఉన్న నేపాల్‌లో భారీ పర్వతాలు, వాటి నుంచి కిందకు వేగంగా దూసుకొచ్చే నదులతో ఎల్లప్పుడూ ముప్పు పొంచి ఉంటుంది. ముఖ్యంగా వానాకాలంలో కురిసే వర్షాల కారణంగా కొండ కోనల్లో పోటెత్తే వరదలు చూస్తుండగానే మహోగ్రరూపం దాలుస్తాయి. ఇది చాలదన్నట్టు వాతావరణ మార్పులు పరిస్థితులను మరింత జటిలం చేస్తున్నాయి. భూతాపం పెరుగుతుండటంతో నేపాల్‌లోని కొండలపై ముంచు కరిగిపోతోంది. హిమనదాలు కనుమరుగు అవుతున్నాయి. ఫలితంగా కొండలపై భారీ గ్లేషియల్ సరస్సులు ఏర్పడుతున్నాయి. కొండప్రాంతాలు సహజంగా అస్థిరంగా ఉంటాయి. ఇలాంటి ప్రాంతాల్లో కొండచరియుల విరిగిపడ్డా లేక కాస్త ఎక్కువ వర్షం కురిసినా సరస్సులు కట్టలు తెంచుకుని దిగువనున్న ప్రాంతాలను ముంచెత్తే అవకావం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా నేపాల్‌లో భారీ వర్షాలు అలజడి సృష్టిస్తున్నాయి. ఆకస్మిక వరదలు ఊళ్లను ముంచెత్తుతున్నాయి. ఉధృతంగా ప్రవహించిన భోటేకోశీ నది నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. టిబెట్ వైపు నుంచి వచ్చిన ఆకస్మిక వరదల కారణంగా పలు ఊళ్లు, బ్రిడ్జ్‌లు, ప్రాజెక్టులు నీటిలో కొట్టుకుపోయాయి. వరద బీభత్సం కారణంగా బుధవారం ఉదయం రసువా జిల్లాలో 1000 మంది నీటిలో కొట్టుకుపోయారని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదలో కొట్టుకుపోయిన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ

ప్రాతిపదికన సహాయ చర్యలు మొదలయ్యాయి. అధికారులు 15 హెలికాప్టర్లను రంగంలోకి దించారు. సహాయక సిబ్బంది బుసి, తుసు ప్రాంతాల్లో 20 మందిని రక్షించారు. గాయపడ్డ వారిని మచిలి ట్రైనింగ్ క్యాంప్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారు వెంటనే అక్కడినుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అధికారులు ఇప్పటి వరకు 8 మృతదేహాలను నీటినుంచి స్వాధీనం చేసుకున్నారు.

## టిబెట్ భూకంపంతోనే వరదలు

**నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్**

టిబెట్‌లో సంభవించిన భూకంపం తమ దేశంలో వరదలకు కారణమై ఉండవచ్చని నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ తెలిపారు. టిబెట్‌లో కొండచరియలు విరిగి పడి తమ దేశంలోని భోటేకోశీ నదిలో వరదలకు దారి తీశాయని ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు మంత్రి ఖనాల్ వివరించారు. టిబెట్‌లో నేడు ఉదయం 8.37 గంటల సమయంలో రిక్టర్ స్కేలుపై 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్టు అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. ఈ నేపథ్యంలో అసలు ఏం జరిగిందనే దానిపై నిపుణులు పరిశీలిస్తున్నారు. మరోవైపు, వరదలు ముంచెత్తిన రసువా జిల్లాకు అనుకుని ఉన్న టిబెట్ గ్యిరోంగ్ పోర్టు ప్రాంతంపై భారీ వరద విరుచుకు పడ్డ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

÷శిపాల్-చైనా సరిహద్దుకు సమీపంలో ముంచుచరియలు, కొండచరియలు విరిగిపడినట్టు శాటిలైట్ ఇమేజీల్లో కనిపించిందని నేపాల్ విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది అంతకుముందే, లేండే నదికి అడ్డంగా మంచుచరియలు పేరుకోవడంతో అక్కడ భారీగా నీరు నిలిచిపోయిందని ఖత్మాండూ యూనిర్సిటీ ప్రొఫెసర్ ఒకరు తెలిపారు. ఆ తరువాత అకస్మాత్తుగా మంచుచరియలు, కొండచరియలు పడిపోవడంతో ఎగువన ఉన్న లేండే నది నీరు భోటే కోశీ నదిలోకి పోటెత్తి ఆకస్మిక వరదలకు దారి తీసిందని చెప్పారు. ఆ సమయంలోనే టిబెట్‌లో భూకంపం సంభవించిందని వివరించారు. ఈ నేపథ్యంలో పూర్తి ఘటనా క్రమం ఎంటో తెలుసుకునేందుకు నేపాల్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. నేపాల్‌లో ప్రవహించే బోటే కోశీ నదికి లేండే ఓ ఉపనది. ఈ నది టిబెట్‌లో మొదలవుతుంది. సరిహద్దును దాటి నేపాల్‌లోకి ప్రవేశించాక భోటే కోశీ నదిలో కలుస్తుంది. అనంతరం భోటే కోశీ నది మరింత దిగవకు వచ్చేసరికి త్రిశూలీ నదిగా పిలుస్తారు. ఈ క్రమంలో త్రిశూలీ నది నేపాల్‌లోని దేవఘాట్ వద్ద కాళీ గండకి నదిలో కలిసి నారాయణి నదిగా భారత్‌లోకి (బిహార్) ప్రవేశిస్తుంది. భారత్‌లో దీన్ని గండక్ నదిగా పిలుస్తారు. ఇది బిహార్, యూపీల మధ్య సరిహద్దుమీదుగా ప్రవహిస్తూ అంతిమంగా గంగా నదిలో కలుస్తుంది.





## నేపాల్ వరదలతో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం

**దెబ్బతిన్నఇళ్లు, రోడ్లు, వంతెనలు, హైడ్రోపవర్ ప్రాజెక్టులు**

**సహాయక చర్యలకు దిగిన భద్రతా బలగాలు**

మెరుపు వరదలపై నేపాల్ ఎంబసీ బుధవారం సాయంత్రం కీలక ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో.. నేపాల్‌లో భారీ వరదలు సంభవించాయని, వరదల్లో భారీగా ఆస్తి, ప్రాణ నష్టంతో పాటు పలువురు గల్లంతయ్యారని వెల్లడించింది. ఇళ్లు, రోడ్లు, వంతెనలు, హైడ్రోపవర్ ప్రాజెక్టులకు భారీ నష్టం జరిగిందని పేర్కొంది. నేపాల్ భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపట్టాయని తెలిపింది. దిగువ ప్రాంతాలకు వరద ముప్పుపై నేపాల్ ప్రభుత్వం అలర్ట్ చేసిందని వెల్లడించింది. గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొంది. విదేశీ సాయం అవసరంపై ఖాట్మాండు నుంచే నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. భారత్‌తో సమన్వయానికి సిద్ధంగా ఉన్నామని నేపాల్ ఎంబసీ స్పష్టం చేసింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ.. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. మెరుపు వరదల కారణంగా జనం ప్రాణాలు కోల్పోవటంపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. వరద పరిస్థితులపై ఆరా తీశారు. అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో బుధవారం ఓ పోస్టు పెట్టారు.

## నేపాల్ ప్రధానికి మోడీ ఫోన్

**వరదలపై ఆరా తీసిన భారత ప్రధాని**

**సహాయ సిబ్బందిని పంపుతామని హామీ**

**న్యూఢిల్లీ:** భారత ప్రధాని నరేంద్ర మోదీ.. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. మెరుపు వరదల కారణంగా జనం ప్రాణాలు కోల్పోవటంపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. వరద పరిస్థితులపై ఆరా తీశారు. అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో బుధవారం ఓ పోస్టు పెట్టారు. పోస్టులో.. 'ప్రధాన మంత్రి బాలేంద్ర షాతో మాట్లాడాను. నేపాల్‌లో సంభవించిన వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేశాను. ఈ కష్టసమయంలో నేపాల్‌లోని సోదర సోదరీమణులకు భారతదేశ ప్రజలు అండగా ఉంటారు. నేపాల్‌కు సాధ్యమైనంత వరకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడానికి భారతదేశం సిద్ధంగా ఉంది. సహాయక, రక్షణ చర్యలపై మా బృందాలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తున్నాయి' అని పేర్కొన్నారు. ఉధృతంగా ప్రవహించిన భోటేకోశీ నది నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. టిబెట్ వైపు నుంచి వచ్చిన మెరుపు వరదల కారణంగా పలు ఊళ్లు, బ్రిడ్జ్‌లు, ప్రాజెక్టులు నీటిలో కొట్టుకుపోయాయి. వరద బీభత్సం కారణంగా బుధవారం ఉదయం రసువా జిల్లాలో 1000 మంది నీటిలో కొట్టుకుపోయారని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదలో కొట్టుకుపోయిన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది.

## నేపాల్ వరదలతో భారత్ అప్రమత్తం

**బీహార్, యూపి సిఎంల అత్యవసర చర్యలు**

**న్యూఢిల్లీ:** నేపాల్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వరదల కారణంగా ఇప్పటి వరకు 16 మంది ప్రాణాలు కోల్పోయారని, 400 మంది గల్లంతయ్యారని స్థానిక అధికారులు అంచనా వేస్తున్నారు. నేపాల్‌లో భారీ వరదల నేపథ్యంలో బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. వరద నీరు రెండు రాష్ట్రాలకు వ్యాపించే అవకాశం ఉన్నందున నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాయి. ఈ మేరకు బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి అధ్యక్షతన బుధవారం అత్యవసర సమావేశం జరిగింది. జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. డ్యామ్‌లు, కరకట్టలపై 24 గంటల నిఘా పెట్టాలని, రాత్రివేళల్లోనూ పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో లౌడ్‌స్పీకర్లతో హెచ్చరికలు జారీ చేయాలని, అత్యవసర పరిస్థితులకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి స్పష్టం చేశారు. నేపాల్ వరదల నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. . ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ముఖ్యమంత్రి యోగీ బుధవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. గండక్, నారాయణి నదులలో నీటి మట్టాలు పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ ప్రభావంతో మహారాజ్‌గంజ్, కుషీనగర్ జిల్లాలలో వరదలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. స్థానిక యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

## ఇరాన్‌పై కొత్తగా దాడులు చేయబోం

**విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో వెల్లడి**

**వాషింగ్టన్ :** పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ మధ్య పరస్పర దాడులు ప్రస్తుతానికి ఆగినా.. యుద్ధ మేఘాలు మాత్రం తొలగిపోలేదు. ఇరాన్‌ను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నుంచి వేరుచేసేలా ఆంక్షలు విధించిన అగ్రరాజ్యం తాజాగా కీలక ప్రకటన చేసింది. ప్రస్తుతానికి ఇరాన్‌పై కొత్తగా దాడులు ఉండవని విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. మిత్రదేశాలకు ఈ విషయాన్ని తెలియజేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఇరాన్ వైపు నుంచి మళ్లీ దాడులు ప్రారంభమయితే అమెరికా సైనిక చర్య చేపట్టే అవకాశాన్ని తోసిపుచ్చలేమని అధికారులు వెల్లడించారు. దాడులు ఉండవని చెప్పినప్పటికీ.. ఇరాన్ ఓడరేవుల నుంచి నౌకల రాకపోకలను కట్టడిచేసేలా హర్మూజ్‌లో దిగ్బంధాన్ని అమెరికా కొనసాగిస్తోంది. మరోవైపు ఆ దేశ ఆర్థిక వ్యవస్థ నడ్డివిరిచేలా కొత్త ఆంక్షలతో విరుచుకుపడింది. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' పేరిట 60 సంస్థలు, వ్యక్తులు, నౌకలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్ సైనిక కార్యకలాపాలు, పెట్రోలియం, పెట్రో కెమికల్ వాణిజ్యంతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ వాటిని ప్రకటించింది. ఇరాన్‌కు ప్రపంచంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్టడమే తాజా ఆంక్షల (జాం బజీనిఇబితినీనిబ నీని ఎసజీని) లక్ష్యమని యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

## రష్యాలో ఇంటిలిజెన్స్ చీఫ్ పర్యటన

**సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్.. మాస్కోలో రహస్య పర్యటన**

**వాషింగ్టన్:** ఉక్రెయిన్-రష్యా మధ్య ఘర్షణలు తీవ్ర స్థాయిలో కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా నిఘా సంస్థ సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్.. మాస్కోలో రహస్యంగా దౌత్య పర్యటన చేపట్టారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నిన్న రష్యా లో అగ్రరాజ్య సైనిక విమానం ఒకటి ల్యాండ్ అవడం మిస్టరీగా మారిన సంగతి తెలిసిందే. ఆ విమానంలో వచ్చింది రాట్‌క్లిఫ్ అని తాజాగా బయటికొచ్చింది. రాట్‌క్లిఫ్ పర్యటనకు ముందు మాస్కోపై డ్రోన్లు, క్షిపణి దాడులు ఆపాలని ఉక్రెయిన్‌ను అమెరికా కోరింది. తమ సీనియర్ అధికారి ఒకరు రష్యాలో పర్యటించ నున్నారని గత సోమవారం అగ్రరాజ్యం నుంచి తమకు సమాచారం వచ్చిందని కీవ్ వెల్లడించింది. దాదాపు 8 గంటల పాటు సీఐఏ చీఫ్ మాస్కోలో ఉన్నట్లు విమానాల ట్రాకింగ్ డేటా తెలిపింది. అయితే, ఈ పర్యటనకు ఆయన సైనిక రవాణా విమానాన్ని ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. భద్రతా కారణాల రీత్యా ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా మిలిటరీ విమానం బోయింగ్ సి-17 గ్లోబ్‌మాస్టర్-3.. వ్నూకోవ్ విమానాశ్రయంలో దిగగానే దౌత్య నంబరు ప్లేట్లతో ఉన్న కాన్వాయ్ అక్కడకు చేరుకున్నట్లు పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే, ఈ పర్యటనలో రాట్‌క్లిఫ్ ఎవరిని కలిశారన్నది మాత్రం తెలియరాలేదు. దీనిపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందించారు. ఆ విమానం గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని, క్రెమ్లిన్‌లో ఈ వారం అమెరికా ప్రతినిధులతో సమావేశాలకు సంబంధించి ప్రణాళికలు కూడా లేవని పేర్కొన్నారు. అటు అమెరికా సీఏఐ కార్యాలయం ఈ కథనాలపై స్పందించలేదు. ఉక్రెయిన్-రష్యా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతోన్న వేళ సీఐఏ చీఫ్ మాస్కోకు రావడం చర్చనీయాంశమైంది. ఆయన ఎందుకొచ్చా రన్న దానిపై అనేక ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఇరాన్‌ను ఒంటరి చేయడమే లక్ష్యంగా అమెరికా 'ఆపరేషన్ ఎకనమిక్ అవుట్‌కాస్ట్'ను ప్రకటించిన సంగతి తెలిసిందే. అంటే టెహ్రాన్‌తో వ్యాపారం సాగించే సంస్థలు, దేశాలను లక్ష్యంగా చేసుకుని పలు ఆంక్షలు విధించనుంది. ఇరాన్‌కు రష్యా వ్యూహాత్మక వాణిజ్య భాగస్వామిగా ఉంది. మరోవైపు, నాటో సభ్య దేశంలో రష్యా దాడి చేసే అవకాశం ఉందని అమెరికా నిఘా సంస్థ ఇటీవల హెచ్చరించింది. నాటో దేశంపై మాస్కో సైబర్ దాడులు, కోవర్ట్ ఆపరేషన్‌లు లేదా చిన్న స్థాయి సైనిక దురాక్రమణ చేపట్టే ప్రమాదం ఉన్నట్లు తెలిపింది. దాని గురించి చర్చించేందుకు సీఐఏ చీఫ్ వచ్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. సీఐఏ అధిపతులు ఇలా రష్యాలో దౌత్య పర్యటనలు చేపట్టడం తొలిసారి కాదు. బైడెన్ హయాంలో 2021 నవంబరులో నాటి సీఐఏ చీఫ్ విలియం బర్న్స్ మాస్కోలో పర్యటించారు. ఉక్రెయిన్‌పై భీకర యుద్ధానికి రష్యా సన్నాహాలు చేస్తోన్న సయమంలో ఆ పర్యటన చోటుచేసుకుంది. నాడు సీఐఏ డైరెక్టర్ నేరుగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం జరిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధం జరిపితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అయితే, అగ్రరాజ్యం మాటను పెడచెవిన పెట్టిన మాస్కో.. 2022 ఫిబ్రవరిలో కీవ్‌పై సైనిక చర్య ప్రారంభించిన సంగతి తెలిసిందే.

## అమెరికా, కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

**అగ్రరాజ్యంపై ప్రతీకార సుంకాలు విధించిన కెనడా**

**కెనడా :** అమెరికా, కెనడా మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్రమవుతోంది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించింది. 27.6 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన.. 700లకు పైగా అమెరికా వస్తువులపై టారిఫ్‌లు విధిస్తున్నట్లు ఆ దేశ పరిశ్రమల శాఖ మంత్రి ఫ్రాంకోయిస్-ఫిలిప్ షాంపేన్ ప్రకటించారు. 25 శాతం సుంకాలు ఉన్న వస్తువుల్లో గృహోపకరణాలు, జున్ను వంటి పాల ఉత్పత్తులు, చేపలు, సముద్రపు ఆహారం వంటివి ఉన్నాయి. ఉక్కు అల్యూమినియం ఉత్పత్తులతో పాటు ఫర్నిచర్, వస్త్రాలకు అత్యధికంగా 50 శాతం సుంకాలు అమల్లోకి రానున్నాయి. మరికొన్ని వస్తువులు, ఉత్పత్తులపై 15, 25 శాతం చొప్పున ప్రతిసుంకాలు విధించింది. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో ఈ తాజా ప్రకటన వెలువడింది. అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలతో పాటు, దేశీయ వ్యాపారాలు, కార్మికుల కోసం కెనడా 7.5 బిలియన్ కెనడియన్ డాలర్లతో సహాయ ప్యాకేజీని ప్రకటించింది. 'అమెరికా ప్రతిపాదించిన కొత్త నిబంధనలు కెనడా ప్రయోజనాలకు అనుకూలంగా లేవు. కెనడా నుంచి ఎక్కువ ఆశిస్తున్న అగ్రరాజ్యం.. ప్రతిఫలంగా మాకు చాలా తక్కువ వనరులను ఇస్తోంది. అందువల్లే మా కార్మికులు, వ్యాపారాలు, వ్యూహాత్మక రంగాలు.. జాతీయ ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండేందుకు ఆ దేశంతో చర్చలు నిలివేశాం' అని కెనడా ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కెనడా దశాబ్దాలుగా అమెరికాను దోచుకుంటోందని మరోవైపు అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్ హౌస్ ఆరోపించింది. తాజా సుంకాలతో ట్రంప్ దాని దోపిడీకి ముగింపు పలికారని తెలిపింది. వివక్షపూరితమైన ఆ దేశ వాణిజ్య పద్ధతులను ఇకపై తాము అంగీకరించబోమని స్పష్టం చేసింది. 'చర్చల సమయంలో ఉక్కు, అల్యూమినియం, కలప ఇతర వస్తువులపై భారీ తగ్గింపులు చేపట్టడానికి హామీ ఇచ్చాం. ప్రపంచంలోని ఏ దేశానికీ ఇవ్వని ప్రాధాన్యతను కెనడాకు ఇచ్చాం. అయినప్పటికీ ఒప్పందం నుంచి వైదొలిగారు. చర్చలకు బదులుగా ప్రతీకారాన్ని ఎంచుకున్నారని పేర్కొంది.

## అమెరికా బెదరింపులను ఎవ్వరూ లెక్క చేయరు

**ఇరాన్ స్పీకర్ మహ్మద్ బాగేర్ గాలిబఫ్ హెచ్చరిక**

**టెహ్రాన్ :** ఇరాన్‌తో ఆర్థిక సంబంధాలు కొనసాగించే దేశాలపై మరిన్ని ఆంక్షలు విధిస్తామనే అమెరికా హెచ్చరికలపై ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్ తీవ్రంగా స్పందించారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ఇతర దేశాలను శాసించే స్థితిలో లేదని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ప్రపంచ దేశాలపై ఒత్తిడి తేచ్చేందుకు అమెరికా పెద్ద పెద్ద హెచ్చరికలు చేస్తుంటుందని, వాటిని ప్రపంచంలోని ఏ దేశాలూ పెద్దగా పట్టించుకోవడం లేదన్నారు. ఆ విషయం అమెరికాకు కూడా తెలుసని ఎద్దేవా చేశారు. ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలు.. తమ వైఖరిని స్పష్టంగా తెలిపాయని గాలిబఫ్ చెప్పారు. ఇటీవల అమెరికా మంత్రి స్కాట్ బెసెంట్ ఇరాన్‌తో ఆర్థిక లావాదేవీలు కొనసాగించే దేశాలు, సంస్థలపై కొత్త ఆంక్షలు విధిస్తామని హెచ్చరించిన సంగతి తెలిసిందే. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' పేరిట ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచే చర్యలకు అమెరికా శ్రీకారం చుట్టింది. అయితే అమెరికా ఒత్తిళ్లకు తాము తలొగ్గబోమని గాలిబఫ్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఇరాన్-అమెరికా మధ్య ఆర్థిక, దౌత్యపరమైన ఉద్రిక్తతలు మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# విజయానికి చేరువలో టీమిండియా

## ముందే ముగిసిన నాలుగో రోజు ఆట..




భారత్, శ్రీలంక మధ్య కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ ఉత్కంఠభరిత దశకు చేరుకుంది. అయితే, కీలకమైన నాలుగో రోజు ఆటలో వర్షం పదేపదే అంతరాయం కలిగించడంతో అంపైర్లు ఆటను ముందుగానే రద్దు చేశారు. ఆట ముగిసే సమయానికి, ఫాలోఆన్ ఆడుతున్న శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. ప్రస్తుతం 16 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉన్నప్పటికీ, మ్యాచ్ పూర్తిగా భారత్ నియంత్రణలో ఉంది. నాలుగో రోజు ఉదయం శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌ను 290 పరుగుల వద్ద ముగించిన భారత్, వెంటనే ఫాలోఆన్ ఇచ్చింది. తొలి ఇన్నింగ్స్‌తో పోలిస్తే రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక బ్యాటర్లు మెరుగైన ఆటతీరు కనబరిచారు. ముఖ్యంగా, మరోసారి అద్భుతంగా ఆడిన పసిందు సూరియబండార (92), కమిందు మెండిస్ (55) భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి, శ్రీలంకకు మంచి ఆధిక్యం అందించేలా కనిపించారు. వీరి నిలకడతో శ్రీలంక శిబిరంలో ఆశలు చిగురించాయి. అయితే, దూకుడుగా ఆడే క్రమంలో కమిందు మెండిస్ చేసిన ఒక పొరపాటు మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో అనవసర షాట్‌కు ప్రయత్నించి స్క్వేర్ లెగ్ వద్ద గాల్లోకి బంతిని లేపాడు. అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న శుభ్‌మన్ గిల్ వెనక్కి పరుగెత్తుతూ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో శ్రీలంక పతనం ప్రారంభమైంది. ఆ వికెట్ పడిన తర్వాత టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. కొద్దిసేపటికే, సెంచరీకి చేరువలో ఉన్న సూరియబండారను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ ధనంజయ డి సిల్వా (23), నిరోషన్ డిక్వెల్లా (6) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయారు. వర్షం కారణంగా ఆట నిలిపివేసే సమయానికి, సోనల్ దినుషా (7), కేశర నువంత (3) క్రీజులో ఉన్నారు. మరో 8 ఓవర్లలో కొత్త బంతి అందుబాటులోకి రానుండటం భారత బౌలర్లకు మరింత అనుకూలించే అంశం. ఐదో రోజు వర్షం ముప్పు ఉన్నప్పటికీ, వాతావరణం అనుకూలిస్తే మ్యాచ్ ఫలితం తేలడం ఖాయం. ఈ మ్యాచ్‌లో గెలవాలంటే భారత్ మరో 4 వికెట్లు పడగొట్టి, ఆపై లక్ష్యాన్నిఛేదించాల్సి ఉంటుంది. బౌలర్లలో మానవ్ సుతార్ రెండు వికెట్లు తీయగా, సిరాజ్, ప్రసిద్ధ్, జడేజా, సారాంశ్ జైన్ తలో వికెట్ సాధించారు.




## వరల్డ్ నంబర్ వన్ బౌలర్‌గా స్టార్క్

### రెండోస్థానానికి పడిపోయిన బుమ్రా

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. బౌలింగ్ విభాగంలో భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఆధిపత్యానికి తెరదించుతూ ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ తొలిసారిగా నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అదే సమయంలో, భారత వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ బ్యాటింగ్ జాబితాలో ఆరు స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంకుకు చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో మిచెల్ స్టార్క్ కనబరిచిన అద్భుత ప్రదర్శనే అతడికి ఈ అగ్రస్థానాన్ని అందించింది. ఆ మ్యాచ్‌లో మొత్తం 10 వికెట్లు పడగొట్టడం ద్వారా స్టార్క్ రెండు స్థానాలు మెరుగుపరుచుకున్నాడు. దీంతో అప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న బుమ్రాతో పాటు న్యూజిలాండ్ బౌలర్ మ్యాట్ హెన్రీని అధిగమించాడు. మరోవైపు, శ్రీలంకతో జరుగుతున్న ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సిరీస్‌కు బుమ్రా దూరంగా ఉండటం అతని ర్యాంకింగ్‌పై ప్రభావం చూపింది. ఈ మార్పులతో బుమ్రా రెండో స్థానానికి, హెన్రీ మూడో స్థానానికి పడిపోయారు. 36 ఏళ్ల స్టార్క్‌కు తన 15 ఏళ్ల సుదీర్ఘ టెస్ట్ కెరీర్‌లో నంబర్ వన్ ర్యాంక్ అందుకోవడం ఇదే మొదటిసారి. ఎక్కువ కాలం టాప్ 10లో ఉన్నప్పటికీ, అగ్రపీఠాన్ని ఎన్నడూ చేరలేదు. బౌలింగ్ జాబితాలో ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఒక స్థానం మెరుగుపరుచుకుని నాలుగో ర్యాంకుకు, స్పిన్నర్ నాథన్ లైయన్ రెండు స్థానాలు ఎగబాకి పదో స్థానంలో నిలిచారు. ఇక బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రిషభ్ పంత్ దూకుడు ప్రదర్శించాడు. గాలెలో శ్రీలంకతో జరిగిన తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో మెరుపు అర్ధశతకం సాధించడంతో ఏకంగా ఆరు స్థానాలు ఎగబాకి సంయుక్తంగా ఏడో ర్యాంకులో నిలిచాడు. బ్యాటింగ్ జాబితాలో తొలి నాలుగు స్థానాల్లో ఎలాంటి మార్పు లేదు. ఇంగ్లండ్ ఆటగాళ్లు హ్యారీ బ్రూక్, జో రూట్ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతుండగా, ఆసీస్ బ్యాటర్లు స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్ వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నారు. భారత్ బ్యాటర్ కేఎల్ రాహుల్ కూడా ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 30వ ర్యాంకుకు చేరుకున్నాడు. ఆల్-రౌండర్ల జాబితాలో భారత సీనియర్ ఆటగాడు రవీంద్ర జడేజా తన అగ్రస్థానాన్ని పదిలంగా ఉంచుకున్నాడు. ఇదే జాబితాలో పాట్ కమిన్స్ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఏడో స్థానానికి చేరుకున్నాడు.

## సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చెమటోడుస్తున్న ప్లేయర్లు



టీమిండియా అభిమానులకు ఓ గుడ్ న్యూస్ వచ్చింది. గాయాలు, రిహాబిలిటేషన్ కారణంగా జట్టుకు దూరంగా ఉన్న టీమిండియా పరిమిత ఓవర్ల స్టార్ ఆటగాళ్లు తిరిగి పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు కఠోరంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం, భారత్, శ్రీలంక జట్ల మధ్య టెస్ట్ సిరీస్ జరుగుతుండగా.. మరోవైపు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్లేయర్లు వర్కౌట్లు చేస్తూ రీ-ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. బెంగళూరులోని వర్కౌట్స్, ట్రైనింగ్ సెషన్లకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వర్క్ లోడ్ మేనేజ్మెంట్‌పై దృష్టి పెట్టగా.. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన గాయం నుంచి వేగంగా కోలుకుంటూ పునరావాస శిక్షణ పొందుతున్నాడు. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ, యంగ్ పేసర్ హర్షిత్ రాణా, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే, స్పిన్నర్ రవి బిష్ణోయ్, సూర్యాంశ్ షెడ్గేలు ఒకే చోట తీవ్రంగా సాధన చేస్తున్నారు. ఈ ప్లేయర్ల ఫోకస్ అంతా రాబోయే ద్వైపాక్షిక సిరీస్‌లపైనే ఉంది. సెప్టెంబర్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న 3 మ్యాచ్ ల టీ20 అంతర్జాతీయ సిరీస్ సమయానికి ఈ వైట్-బాల్ స్టార్లు పూర్తి ఫిట్నెస్ సాధించాలని చూస్తున్నారు. ఆ తర్వాత అక్టోబర్ లో వెస్టిండీస్ జట్టుతో జరగబోయే వన్డే, టీ20 సిరీస్ కు ఈ కీలక ఆటగాళ్లందరూ భారత జట్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ఆటగాళ్లకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇవ్వడం, గాయాల నిర్వహణపై కొన్ని ఆరోపణలు తలెత్తిన నేపథ్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మీడియా సమావేశంలో మాట్లాడి క్లారిటీ ఇచ్చారు. ఎంపిక ప్రక్రియలో, ఆటగాళ్ల ఫిట్‌నెస్ నివేదికలలో పూర్తి పారదర్శకత ఉంటుందని లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఒకవేళ ఆటగాడు మ్యాచ్ సమయానికి ఫిట్‌నెస్ నిరూపించుకోకపోతే మరికరిని ఎంపిక చేస్తారని అర్థం. తాము నిందలు వేసేందుకు ఇష్టపడమని.. ప్లేయర్లు కోలుకునే పురోగతిని ప్రతి దశలో పర్యవేక్షిస్తూ సెలెక్షన్ కమిటీకి నివేదిస్తామని వీవీఎస్ లక్ష్మణ్ పేర్కొన్నారు. మొత్తానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో స్టార్ ప్లేయర్ల కఠోర శ్రమ చూస్తుంటే.. త్వరలోనే భారత వైట్-బాల్ జట్టు పూర్తి బలంతో మైదానంలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది.

## అదరగొట్టిన భువీ.. యూపీ లీగ్‌లో లక్నో హవా



యూపీ టీ20 లీగ్ 2026లో లక్నో ఫాల్కన్స్ జోరు కొనసాగుతోంది. భారత సీనియర్ పేసర్, కెప్టెన్ భువనేశ్వర్ కుమార్ తన పదునైన బౌలింగ్‌తో మరోసారి మాయ చేయడంతో డిఫెండింగ్ ఛాంపియన్ కాశీ రుద్రాస్‌పై లక్నో ఫాల్కన్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో లక్నోకు ఇది వరుసగా మూడో గెలుపు కావడం విశేషం. రెండు రోజుల వ్యవధిలో కాశీ జట్టుపై లక్నోకి ఇది రెండో విజయం. లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన లక్నో ఫాల్కన్స్ బౌలింగ్ ఎంచుకుంది. కెప్టెన్ భువనేశ్వర్ కుమార్ ఆరంభంలోనే అద్భుత స్పెల్‌తో చెలరేగాడు. పవర్‌ప్లేలోనే మూడు కీలక వికెట్లు పడగొట్టి కాశీ రుద్రాస్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. దీంతో కాశీ జట్టు 28 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో శుభమ్ చౌబే (32 బంతుల్లో 46) ఒంటరి పోరాటంతో కాశీ జట్టు కాస్త కోలుకుంది. అయితే, మరో పేసర్ అభినందన్ సింగ్ (3/16) మిడిల్, లోయర్ ఆర్డర్‌ను దెబ్బతీయడంతో కాశీ రుద్రాస్ 19.1 ఓవర్లలో 126 పరుగులకే ఆలౌట్ అయింది. భువనేశ్వర్ 20 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. 127 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో ఫాల్కన్స్‌కు ఓపెనర్ మహమ్మద్ సైఫ్ (8 బంతుల్లో 17) మంచి ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే, కాశీ బౌలర్ సంగమ్ సింగ్ ఒకే ఓవర్లో సైఫ్‌తో పాటు అజీత్ వర్మ (0)ను పెవిలియన్‌కు పంపి షాకిచ్చాడు. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన హిమాన్షు సింగ్ (41 బంతుల్లో 64; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) దూకుడైన అర్ధశతకంతో ఛేదనను నడిపించాడు. జట్టు స్కోరు 109 వద్ద అతను ఔటయ్యేసరికే లక్నో విజయం దాదాపు ఖాయమైంది. మధ్యలో కొద్దిసేపు వర్షం ఆటంకం కలిగించినా, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ప్రియమ్ గార్గ్, కీపర్ కార్తికేయ సింగ్ లాంఛనాన్ని పూర్తి చేశారు. లక్నో ఫాల్కన్స్ 24 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్ అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్న భువనేశ్వర్ కుమార్ మాట్లాడుతూ, "మేం టోర్నీ మొదలుపెట్టినప్పుడు పాయింట్ల పట్టికలో వెనుకబడి ఉన్నాం. కానీ గత మూడు మ్యాచ్‌లలో అద్భుతంగా ఆడాం. ఇది మాకు చాలా మంచిది, పట్టికలో పైకి వెళ్లేందుకు సాయపడింది," అని అన్నాడు. తన బౌలింగ్ ప్రణాళికపై స్పందిస్తూ, "పిచ్ బాగుంది, కొద్దిగా స్వింగ్ లభించింది. సరైన ఏరియాల్లో బంతులు వేయడమే నా ప్రాథమిక ప్రణాళిక. అదృష్టవశాత్తూ అది ఫలించింది. సాధారణంగా రెండు, మూడు బంతులకు మించి స్వింగ్ లభించదు. కానీ ఈరోజు నాకు బాగా కలిసొచ్చింది. జట్టుగా అద్భుత ప్రదర్శన చేశాం" అని వివరించాడు. తక్కువ లక్ష్యాన్ని ఛేదించేటప్పుడు ఓపెనర్లు దూకుడుగా ఆడటం ఎంతో కీలకమని, హిమాన్షు అద్భుత ఇన్నింగ్స్ ఆడాడని ప్రశంసించాడు.




## ఇలా అయితే 'మళ్లీ అదే తప్పు చేస్తారు'

### జైస్వాల్-ఫెర్నాండో వివాదంపై మంజ్రేకర్ ఫైర్

భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్, శ్రీలంక పేసర్ అసిత ఫెర్నాండో మధ్య జరిగిన వివాదంపై మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ స్పందించారు. ఆటగాళ్ల తప్పిదాలపై తేలికగా వ్యవహరిస్తే.. వారు మళ్లీ అదే ప్రవర్తనకు పాల్పడే అవకాశం ఉందని అన్నారు. ఇలాంటి ఘటనలు ఆటకు, ముఖ్యంగా ఆటగాళ్ల భవిష్యత్తుకు మంచిది కాదని పేర్కొన్నారు. కొలంబోలో జరిగిన రెండో టెస్టులో జైస్వాల్ ఔటైన తర్వాత ఫెర్నాండోతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తగిలింది. ఘటనపై అంతర్జాతీయ క్రికెట్ మండలి ఇద్దరు ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. ఒక్కొక్కరికి ఒక డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. ఈ వ్యవహారంపై మంజ్రేకర్ సోషల్ మీడియాలో స్పందించారు. వైభవ్ సూర్యవంశీ ఘటనను కూడా ప్రస్తావిస్తూ ఐసీసీ, బీసీసీఐను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఆటగాళ్లను ఇలాంటి ప్రవర్తన నుంచి తప్పించుకుంటూ పోతే.. అదే పని మళ్లీ చేసేలా ప్రోత్సహించినట్టవుతుందని అన్నారు. ఇటీవల శ్రీలంక 'ఏ'తో మ్యాచ్ సందర్భంగా 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కూడా వివాదంలో చిక్కుకున్నాడు. శ్రీలంక 'ఏ' ఆటగాడు విషెన్ హలంబగేతో అతడు భౌతిక ఘర్షణకు దిగాడు. అప్పట్లో మంజ్రేకర్ ఈ ఘటనను తీవ్రంగా తప్పుబట్టారు. తాను ఇండియా 'ఏ' మేనేజ్‌మెంట్‌లో ఉంటే తదుపరి మ్యాచ్‌కు వైభవ్‌ను తప్పించేవాడినని చెప్పారు. జైస్వాల్ కూడా తనపై వచ్చిన విమర్శలకు స్పందించాడు. వ్యాఖ్యాత హర్ష భోగ్లే ఈ ఘటనపై ఇన్‌స్టాగ్రామ్‌లో మాట్లాడిన తర్వాత జైస్వాల్ స్పందిస్తూ.. అసలు ఏం జరిగిందో తెలియకుండా తీర్పు ఇవ్వొద్దని కోరాడు. ఎవరైనా హద్దు దాటితే భారత్ పోరాడుతుందని, తగిన సమాధానం ఇస్తుందని వ్యాఖ్యానించాడు.



## గర్భంతోనూ జిమ్‌లో సమంత..

గర్భధారణ సమయంలో తన ఫిట్‌నెస్ రొటీన్ ఎలా మారిందో నటి సమంత వెల్లడించింది. జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకుంది. ఇన్నాళ్లూ శరీరాన్ని మరింతగా శ్రమ పెట్టేలా శిక్షణ తీసుకున్నానని.. ఇప్పుడు శరీరం చెప్పేది వినడం నేర్చుకుంటున్నానని తెలిపింది. సమంత ఎన్నో ఏళ్లుగా శక్తిని పెంచే వ్యాయామాలు చేస్తున్నట్లు చెప్పింది. గర్భధారణ సమయంలోనూ వ్యాయామం కొనసాగించేందుకు వైద్యుడి అనుమతి తీసుకున్నానని తెలిపింది. తన ట్రైనర్‌కు గర్భధారణ సమయంలో వ్యాయామాలపై ప్రత్యేక శిక్షణ ఉందని వెల్లడించింది. తన శరీరం, గత అనుభవం, గర్భధారణ పరిస్థితికి తగ్గట్టుగా వర్కౌట్స్‌లో మార్పులు చేసినట్లు వివరించింది. ప్రతి ఒక్కరి గర్భధారణ ఒకేలా ఉండదని సమంత చెప్పింది. తన వర్కౌట్స్‌ను ఇతరులు అనుసరించొద్దని సూచించింది. వ్యాయామం చేసే ముందు వైద్యుడిని సంప్రదించాలని.. నిపుణులైన ట్రైనర్ సాయం తీసుకోవాలని కోరింది.. తాను పంచుకున్న వీడియోలో ఛాతీకి సంబంధించిన వ్యాయామం చేసింది. అయితే గతంలోలా ఎక్కువ బరువు ఎత్తడంపై కాకుండా.. శరీరం ఇచ్చే సంకేతాలను గమనించడంపైనే ఇప్పుడు దృష్టి పెట్టినట్లు చెప్పింది. కొన్ని రోజులు వ్యాయామాన్ని తగ్గిస్తున్నానని తెలిపింది. కొన్ని రోజులైతే వర్కౌట్ మొత్తం నేలపై పడుకోవడంతోనే పూర్తవుతోందని సమంత సరదాగా వ్యాఖ్యానించింది. ఇన్నేళ్లుగా తన శరీరాన్ని మరింత పని చేయడానికి సిద్ధం చేశానని.. ఇప్పుడు తక్కువ పని చేయమని శరీరం అడిగినప్పుడు దాన్ని గౌరవించడం నేర్చుకుంటున్నానని పేర్కొంది. చిన్న ప్రాణాన్ని మోస్తున్న సమయంలో లక్ష్యాలు కూడా మారిపోతాయని సమంత అభిప్రాయపడింది. తన శరీరం ఇప్పటివరకు చేసిన పనుల్లో ఇదే అత్యంత బలమైన పని కావచ్చని పేర్కొంది. సమంత 2026 జూన్‌లో తన గర్భధారణ విషయాన్ని బహిరంగంగా వెల్లడించింది. భర్త రాజ్ నిడిమోరుతో కలిసి తొలి బిడ్డకు స్వాగతం పలకబోతున్నట్లు ప్రకటించింది.



## ఓణం సెలబ్రేషన్స్‌లో మానస వారణాసి

టాలీవుడ్ అందాల భామ ఫెమినా మిస్ ఇండియాగా మన దేశ గుండెచప్పుడుగా మారిన మానస వారణాసి, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలతో కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. పండుగ వేళ కుందనపు బొమ్మలా మెరిసిపోతూ నెటిజన్లను కట్టిపడేసింది. పచ్చని ప్రకృతి ఒడిలో సంప్రదాయ దుస్తుల్లో ఆమె ఇచ్చిన పోజులు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. పద్ధతిగల చీరకట్టులో మానస చందమామలా మెరిసిపోతున్న ఈ క్యూట్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఓణం పండుగను పురస్కరించుకుని మానస ఎంచుకున్న అవుట్‌ఫిట్ ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. 'భువి శారీస్' డిజైన్ చేసిన క్లాసిక్ ఆఫ్-వైట్ కేరళ కసవు చీరలో ఆమె మెరిసిపోయింది. ఇక చీర అంచున ఉన్న మెరిసే గోల్డెన్ జరీ బోర్డర్, చిన్న చిన్న చుక్కల డిజైన్ ఆమెకు రాయల్ లుక్‌ను తెచ్చిపెట్టాయి. ఈ కేరళ సంప్రదాయ చీరకట్టులో మానస పక్కా సౌత్ ఇండియన్ రాకుమారిలా కనిపిస్తోందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. వైట్ శారీకి కాంబినేషన్‌గా మానస వేసుకున్న డార్క్ గ్రీన్ బ్రోకేడ్ బ్లౌజ్ ఈ ఫోటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోచేతి వరకు ఉన్న ఈ డిజైనర్ బ్లౌజ్‌పై చేసిన వర్క్ ఆమె అవుట్‌ఫిట్‌కు మరింత లుక్‌ని ఇచ్చింది. ఇక దీనికి తోడు మెడలో వేసుకున్న హారం, మ్యాచింగ్ చెవి దిద్దులు, నుదుటన ఎర్రటి బొట్టు, తలలో మల్లెపూలు తురుముకుని పక్కా పండుగ కళను నింపుకుంది. ఇక పచ్చని చెట్ల మధ్య ఆమె చిందించిన చిరునవ్వు నెటిజన్ల మనసులను దోచేస్తోంది.

## రోమాంచకం ట్రైలర్ విడుదల

టాలీవుడ్ అగ్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, 'మేమ్ ఫేమస్' చిత్రం ద్వారా యూత్‌లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా సినిమా 'రోమాంచకం' . భద్రకాళి పిక్చర్స్ మరియు ప్రణయ్ రెడ్డి వంగా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సుమంత్ ప్రభాస్ సరసన అనంతిక సానిల్‌కుమార్ కథానాయకిగా నటిస్తుండగా, వాసుకి వైభవ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 3న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కాబోతుండగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. కేవలం సాధారణ ప్రేమకథా చిత్రంగా కాకుండా, నేటి ఆధునిక కాలంలోని డేటింగ్ యాప్స్, రిలేషన్‌షిప్స్ మరియు ఊహించని మలుపులతో కూడిన యూత్ ఫుల్ రొమాంటిక్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. ట్రైలర్‌లో సుమంత్ ప్రభాస్ తనదైన తెలంగాణ నేటివిటీ యాసతో పాటు, తన మార్క్ కామెడీ అండ్ ఎనర్జిటిక్ నటనతో మరోసారి యువతను ఆకట్టుకునేలా కనిపించారు. మొదట ఎంతో సరదాగా, క్యూట్‌గా సాగే ఈ లవ్ స్టోరీ ఆ తర్వాత ఇంటెన్స్ ఎమోషన్స్, ఊహించని గొడవలు మరియు ఉత్కంఠభరితమైన మలుపులతో ఎలా సాగిందనే అంశాలను ట్రైలర్‌లో ఎంతో ఆసక్తికరంగా చూపించారు. సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ చిత్రానికి ప్రెజెంట్‌గా వ్యవహరిస్తుండటంతో, ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.






## సుహాస్ విలన్‌గా సముద్ర నేపథ్య కథతో మండాడి

కోలీవుడ్ నటుడు సూరి హీరోగా, టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ నటుడు సుహాస్ విలన్ పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'మండాడి'. సముద్రం నేపథ్యంలో రాబోతున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాను 'సెల్ఫీ' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన మతిమారన్ పుగళేంది ఈ చిత్రానికి కథ అందించి దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ టీజర్ చూస్తుంటే.. తమిళనాడులోని తీర ప్రాంతాలకు చెందిన సాంప్రదాయ బోట్ రేస్ పోటీల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. సముద్రం నేపథ్యంలో సాగే హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా ఇది రూపొందుతోంది. ఇందులో సూరి సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, తెలుగు నటుడు సుహాస్‌తో పాటు ప్రముఖ నటుడు సత్యరాజ్, రవీంద్ర విజయ్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌లో వచ్చే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చాలా ఇంప్రెస్సివ్‌గా ఉంది. ఈ సినిమా కోసం హీరో సూరితో పాటు నటుడు సుహాస్ ఎలాంటి బాడీ డబుల్స్ లేకుండా సముద్రంలో రిస్కీ యాక్షన్ సన్నివేశాలు, బోట్ రేస్ సీక్వెన్స్‌లలో చాలా కష్టపడి నటించినట్లు తెలుస్తుంది.



## మరో మాఫియా డాన్ కథ

### యశ్ టాక్సిక్ మూవీ విశ్లేషణ

కేజీఎఫ్' ఫ్రాంచైజీ తర్వాత యశ్ నుంచి వస్తున్న సినిమా అనగానే 'టాక్సిక్'పై దేశవ్యాప్తంగా అంచనాలు మొదలయ్యాయి. దానికి తగ్గట్టే ఈ సినిమా ప్రచార చిత్రాలు కూడా సినిమాపై ఆసక్తిని పెంచాయి. భారీ తారాగాణంతో, హాలీవుడ్ స్థాయి అత్యున్నత సాంకేతిక విలువలతో, ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో బుధవారం 'టాక్సిక్' విడుదలైంది. గంగా (నయనతార), రాయ(యశ్) అక్కాతమ్ముళ్లు. చిన్నతనంలోనే అమ్మానాన్న దూరం కావడంతో రాయను గంగే అమ్మగా మారింది. తన జీవితాన్ని పణంగా పెట్టి మరీ తమ్ముడ్ని పెంచి పెద్ద చేసింది. చిన్నతనం నుంచీ నేర ప్రపంచంలోనే పెరిగి పెద్ద కావడంతో ఇద్దరూ నేరప్రవృత్తితోనే ఎదుగుతారు. గోవా నేరసామ్రాజ్యానికి తన తమ్ముడ్ని అధిపతిగా చూడాలనుకుంటుంది గంగ. అందుకోసం అప్పటికే గోవాను ఏలుతున్న ఓ మాఫియా డాన్‌తో చేతులు కలుపుతుంది. ఆ గ్యాంగ్‌లో రాయ కీలకమైన వ్యక్తిగా ఎదుగుతాడు. మాఫియా డాన్ కూతురు రెబెక్కా(తార సుతారియా) రాయకు చేరువవుతుంది. ఇద్దరూ ఒకటవుతారు. మరోవైపు ప్రత్యర్థుల దాడులు, ప్రతిదాడులతో కథ సాగుతూ ఉంటుంది. ఇంతలో రాయకు రాయల్ సర్కస్‌లో పనిచేసే నాడియా(కియారా అద్వానీ) పరిచయం అవుతుంది. మానసికంగా, శారీరకంగా కూడా ఇద్దరూ ఒకటవుతారు. ఈ క్రమంలో నాడియా గర్భవతి అవుతుంది. తన కూతురుని కాదని వేరొక అమ్మాయితో రాయా తిరుగుతున్నాడని తెలిసి మాఫియా డాన్ మండిపడతాడు. ఈ క్రమంలో జరిగిన కలామటీలో ఆ మాఫియా డాన్ రాయ్ చేతులో హతుడవుతాడు. అనుకోని పరిస్థితుల్లో శత్రువుల చేతుల్లో రాయా అక్క గంగ, రాయా ప్రేయసి నాడియా చిక్కుకుంటారు. కడుపులో ఉన్న బిడ్డను చంపుతామని బెదిరించి, నాడియా చేతులతోనే గంగను దండగులు చంపిస్తారు. అక్క చావుకు కారణమైన ప్రియురాలిని రాయ క్షమించాడా? శిక్షించాడా? నాడియా జీవితం ఎలాంటి మలుపు తీసుకున్నది? అక్క కోరిక ప్రకారం రాయా గోవా మాఫియా సామ్రాజ్యానికి అధిపతిగా ఎదిగాడా? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ. కేజీఎఫ్'లో ఎలాగైతే నేర ప్రపంచంలో పెరిగి, డాన్‌గా ఎదుగుతాడో.. ఇందులోనూ దాదాపుగా అంతే. అదే ధోరణిలో కథ సాగింది. అందులో అమ్మ సెంటిమెంట్. ఇందులో అక్క సెంటిమెంట్. తప్పు చేసిన ఓ తండ్రి మానసిక వేదనే ఈ సినిమా కథ అని చెప్పొచ్చు. సినిమా ప్రథమార్థం సాధారణ మాఫియా సినిమాలా అనిపించినా, ద్వితీయార్థం మాత్రం కథ కొత్త మలుపు తీసుకుంటుంది. ఆ మలుపుకు సంబంధించిన సంఘర్షణ ఆడియన్‌కి కొత్తగా అనిపిస్తుంది. ఏదేమైనా అసలు కథ కంటే యాక్షన్ అంశాలకే దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్టు అనిపిస్తుంది. ఆద్యంతం నరుక్కోవడాలు, చంపుకోవడాలు, కాల్చుకోవడాలు, మధ్య మధ్య ఇంటిమేటెడ్ సీన్స్. కుటుంబ ప్రేక్షకులకు కలిసి చూసేలా అయితే సినిమా లేదు. యశ్ ఇందులో తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేశాడు. యశ్ అక్క గంగగా నయనతార కథలో ప్రాధాన్యత గల పాత్రను పోషించింది. ఇందులో ఆమె యాక్షన్ సీక్వెన్స్ కూడా అదరగొట్టింది. ఇక కియారా అద్వానీ భావోద్వేగపూరితమైన పాత్ర పోషించింది. చక్కగా అభినయించింది. తారా సుతారియా, రుక్మిణీ వసంత్ పాత్రలు గ్లామర్‌కే పరిమితం అయ్యాయి. చెప్పుకోదగ్గ కథ కాదు. మేకింగ్ మాత్రం బావుంది. గీతూ మోహన్‌దాస్ స్క్రీన్‌ప్లేను అర్థం చేసుకోవడం సగటు ప్రేక్షకుడికి కష్టమే. మొత్తం కథ, కథనం విషయంలో కాస్త జాగ్రత్త తీసుకుంటే బావుండేది. నిర్మాతలు డబ్బులు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు పెట్టారు. ఖర్చుపెట్టిన ప్రతి పైసా తెరపై కనిపించింది. ఇక రవి బస్రూర్ నేపథ్య సంగీతం బావుంది. కెమెరా వర్క్ కూడా బావుంది. మొత్తంగా సాంకేతికంగా సినిమా బావుంది.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342